



మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్ వద్ద వర్షంలో తడుస్తూనే వరి పనలను కుప్ప వేసే పనుల్లో రైతులు

ధాన్యం ఏ మిల్లుకైనా తరలించుకోవచ్చు

- 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ
- వరి రైతులను గత ప్రభుత్వం ఇబ్బంది పెట్టింది
- రూ.1,600 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించిన కూటమి ప్రభుత్వం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నట్టు వెల్లడి



మర్రిపాలెంలో జ్యోతిప్రజ్వలనం చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పండించిన ధాన్యాన్ని రైతులు ఏ రైస్‌మిల్లుకైనా తరలించుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, ధాన్యం విక్రయించిన 48 గంటల్లో ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నదని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. గురువారం మండలంలోని మర్రిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఎక్కడో దూరంగా వున్న రైస్‌మిల్లులను కేటాయించేవారని, దీంతో రవాణా ఖర్చులు రైతులకు భారంగా మారాయన్నారు. అంతేకాక ధాన్యం డబ్బులు సకాలంలో చెల్లించలేదని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ధాన్యం రైతులకు బకాయి పెట్టిన రూ.1,600 కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిదని గుర్తు చేశారు. ఈ నెల 21వ తేదీన జరగనున్న తాండవ ప్రాజెక్టు కమిటీ ఎన్నికల్లో చైర్మన్ పదవికి కరక సత్యనారాయణను ఎంపిక చేసినట్టు అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. తాండవ రిజర్వాయర్ ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, దీనివల్ల ప్రధాన కాలువలతోపాటు పంట కాలువలను అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. జిల్లాలో మూతపడిన సహకార చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించడానికి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలో మొదటి సంవత్సరం రహదారులు, రెండో ఏడాది చెరువులు, మూడో ఏడాది పాఠశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు.

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా రైతుల నుంచి 25 వేల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 420 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. రైతులకు త్వరలో గుర్తింపుకార్డులు జారీ చేయనున్నామని, ఈ కార్డు వుంటే పంట రుణాలు పొందడానికి బ్యాంకులకు వన్‌బీ అడంగల్ కాపీలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఉమాప్రసాద్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, కూటమి పార్టీల నాయకులు సింగంపల్లి సన్యాసిదేముడు, అపిరెడ్డి మాణిక్యం, పారుపల్లి దాసు, అప్పన్న దివాణం, వనిమిన సూర్యారావు, రాజాన సూర్యచంద్ర, వెలగల వెంకటరమణ, బైన మురళి, గవిరెడ్డి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతికి వందే భారత్?

- స్లీపర్ కోచ్‌లతో నడిపే ప్రతిపాదన
- అయితే 6 నెలలకుపైగా సమయం పడుతుందంటున్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం నుంచి వందేభారత్ రైళ్ల సంఖ్యను పెంచాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుతం విశాఖ నుంచి నాలుగు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య రెండు, భువనేశ్వర్‌కు ఒకటి, దుర్గ్‌కు మరొకటి వెళుతున్నాయి. తిరుపతి, బెంగళూరు నగరాలకు కూడా విశాఖ నుంచి వందేభారత్ రైళ్లు నడపాలని ప్రజా ప్రతినిధులు రైల్వే అధికారులను కోరారు. అందుకు వారి నుంచి సానుకూల స్పందన వచ్చింది. అయితే ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్ రైళ్లు కాకుండా కొత్తగా తయారుచేస్తున్న స్లీపర్ కోచ్ రైళ్లను ఇవ్వనున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో వందే భారత్ స్లీపర్ క్లాస్ రైళ్లు తయారవుతున్నాయి. వీటిని ముందు 700 కి.మీ. దూరం పైబడి రాత్రిపూట ప్రయాణం చేసే మార్గాల్లో నడపాలని రైల్వే వర్గాలు నిర్ణయించాయి. స్లీపర్ క్లాస్ రైలు తయారీ పూర్తికాగానే సెప్టెంబరులో ఢిల్లీ-శ్రీనగర్‌ల మధ్య ప్రారంభించాలని అనుకున్నారు. అయితే తయారీలో జాప్యం జరుగుతోంది. జనవరిలో మొదటి స్లీపర్ క్లాస్ వందే భారత్ పట్టాలపైకి వస్తుందని చెబుతున్నారు. విశాఖపట్నం కోటా వచ్చేసరికి ఆరు నెలల సమయం పడుతుందని, జూన్ లేదా జూలైలో విశాఖ-తిరుపతి మధ్య స్లీపర్ క్లాస్ వందేభారత్ మొదలయ్యే అవకాశం ఉందని వాల్తేరు డివిజన్ రైల్వే వర్గాలు తెలిపాయి.

అన్నదాత ఆందోళన

అల్పపీడనంతో జిల్లా వ్యాప్తంగా ముసురు

సాయంత్రం తరువాత పెరిగిన వర్షం

- ఇప్పటికే వరి కోతలు వాయిదా వేసిన రైతులు
- అంతకు ముందు కోత కోసిన పొలాల్లో హడావిడిగా కుప్పలు
- కొన్నిచోట్ల పనలు ఎండక, కూలీలు లభించక కుప్ప వేయలేని పరిస్థితి
- వర్షాలకు పనలు తడిసిపోతాయని ఆవేదన
- నేడు భారీ వర్షం హెచ్చరికలతో అధికారులు అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- టోల్ ఫ్రీ నంబర్లు: 08924-226599, 222888



కోటవురట్ల మండలం లింగాపురంలో కూలీలు లభించకపోవడంతో కుప్ప వేయని వరి పనలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో గురువారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అప్పుడప్పుడు తేలికపాటి వర్షపు జల్లులు పడ్డాయి. రాత్రి తరువాత వర్షం అధికమైంది. శుక్రవారం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ శాఖ సమాచారంతో అన్నదాతలు కలవరం పడుతున్నారు. ఇంకా వరి పైరు కోయని, ఇప్పటికే కోసి కుప్పలు వేయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు 1.4 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. క్షేత్ర స్థాయి నుంచి జిల్లా అధికారులకు అందిన సమాచారం మేరకు గురువారం నాటికి 65 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఇందులో 55 వేల ఎకరాల్లో బుధవారంనాటికే కుప్పలు వేశారు. కాగా మూడు, నాలుగు రోజుల క్రితం వరి పంట కోసి, కుప్ప వేయని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత సోమవారం నుంచి ఎండ అంతగా కాయకపోవడంతో వరి పనలు పూర్తిగా ఎండలేదు. బుధవారం మధ్యాహ్నం తరువాత నుంచి వర్షం మొదలైంది. గురువారం పగలంతా చెదురుమదురుగా జల్లులు పడుతూనే వున్నాయి. దీంతో కుప్ప వేయకపోతే భారీ వర్షాలకు పంట మొత్తం నీటిపాలవుతుందేమోనన్న భయంతో ఒకపక్క వర్షానికి తడుస్తూనే ఆదరాబాదరాగా కుప్పలు వేశారు. కాగా ఎక్కువ విస్తీర్ణంలో వరి పంట కోసి, కుప్పలు వేయని గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. అధిక కూలి చెల్లించడానికి సిద్ధపడినప్పటికీ కూలీలు లభించకపోవడంతో గురువారం కూడా కుప్పలు వేయలేకపోయామని కోటవురట్ల మండలం లింగాపురం గ్రామానికి చెందిన ఓ రైతు వాపోయారు.

పెరుగుతున్న వర్షం

జిల్లాలో గురువారం రాత్రి ఎనిమిది గంటల నుంచి వర్షం పెరుగుతున్నది. కోటవురట్ల, ఎలమంచిలి, కశింకోట, పరవాడ, రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, అనకాపల్లి మండలాల్లో దఫదఫాలుగా జల్లులు పడుతున్నాయి. ఇదే సమయంలో ఈదురుగాలులు వీస్తున్నాయి. వర్షంతోపాటు శీతల వాతావరణం నెలకొనడంతో రాత్రి ఎనిమిది గంటల నుంచే రహదారులపై జనసంచారం తగ్గిపోయింది.

అధికారులు అప్రమత్తం....

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న ... మిగతా 8వ పేజీలో

విశాఖకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాక



పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనసేన నాయకుడు కోన తాతారావు

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ గురువారం రాత్రి విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా రాడిసన్ హోటల్‌కు వెళ్లి బస చేశారు. ఆయన శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళతారు. శనివారం అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో పర్యటిస్తారు.

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జుల కాల పరిమితి పెంపు

విశాఖపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 ప్రాథమిక సహకార పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జుల కాల పరిమితిని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. గత ప్రభుత్వం రాజకీయ పార్టీకి చెందిన ముగ్గురితో పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ... మిగతా 8వ పేజీలో

గోతుల పూడ్చివేతపై నిర్లక్ష్యం

బీఎన్ రోడ్డులో ఇప్పటికీ మారని దుస్థితి

- సంక్రాంతిలోగా రోడ్లపై గుంతలన్నీ పూడ్చాలని కూటమి ప్రభుత్వం ఆదేశం
- ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంపై వాహనదారులు మండిపాటు

చోడవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): **వచ్చే సంక్రాంతినాటికి రహదారులపై గుంతలు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తరచూ హెచ్చరికలతో ఆదేశిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో గుంతల పూడ్చివేతపై అధికారుల్లో అలసత్వం కొనసాగుతున్నది. దీంతో వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.**



విజయరామురాజుపేట జంక్షన్ వద్ద ఇప్పటికీ పూడ్చని భారీ గోతులు



వడ్డాది వద్ద ఛిద్రమై, చిత్తడిగా మారిన బీఎన్ రోడ్డు

ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారులను పట్టించుకోకపోవడంతో చోడవరం నియోజకవర్గం పరిధిలోని బీఎన్ రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడంతోపాటు, తాత్కాలికంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా గుంతలు పూడ్చాలని సీఎం చంద్రబాబు నాయుడు రెండు నెలల క్రితం ఆదేశించారు. గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేశారు. గోతుల పూడ్చివేత పనులను ప్రభుత్వం గత నెలలో ప్రారంభించింది. అయితే మూడు జిల్లాల ప్రజల రాకపోకలకు ఎంతో కీలకమైన బీఎన్ రోడ్డులో గోతులు పూడ్చివేత పనులు అరకొరగా సాగుతున్నాయి. వెంకన్నపాలెం జంక్షన్ నుంచి చోడవరం వరకు గోతులు పూడ్చలేదు. ముఖ్యంగా గోవాడ, అంభేరుపురం, అడ్డూరు, చోడవరం ప్రాంతాల్లో ఏర్పడిన భారీ గోతులను ఇంతవరకు పూడ్చకపోవడంతో వాహనదారులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. అడ్డూరు సమీపంలో గుంతల వద్ద మెటీరియల్ వేసిన కాంట్రాక్టర్.. ... మిగతా 8వ పేజీలో

అదుపులోకి రాని అతిసార

భరణికంలో మరో నలుగురికి డయేరియా



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కొండమ్మ, కాకర శ్రీను



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బాలాజీ

- పరవాడ పీహెచ్‌సీకి తరలింపు
- బాధితులను పరామర్శించిన డీఎంహెచ్‌వో

పరవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భరణికంలో అతిసార అదుపులోకి రాలేదు. గురువారం మరో నలుగురు డయేరియా బారినపడ్డారు. ఈ గ్రామంలో నాలుగు రోజుల క్రితం అతిసార ప్రబలడంతో దీనిబారిన పడిన 13 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్న విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన కర్రి అప్పారావు(30), కర్రి గౌతమి(25), ఆర్లి కొండమ్మ (70), కాకర శ్రీనువాసరావు (52)లకు గురువారం ఉదయం వాంతులు, విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం అక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. కాగా గత మూడు రోజుల్లో డయేరియా బారినపడి ఆస్పత్రుల్లో చేరిన వారిలో తొమ్మిది మంది ఆరోగ్యం సాధారణ స్థితికి రావడంతో ఇళ్లకు చేరుకున్నారు. డీఎంహెచ్‌వో ఎంపీఎస్‌కే బాలాజీ గురువారం భరణికంలో పర్యటించారు. పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాన్ని సందర్శించారు. వారం రోజులపాటు కొనసాగించాలని వైద్యులను ఆదేశించారు. అంతకుముందు పరవాడ పీహెచ్‌సీని సందర్శించి. చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించారు.

450 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్టు

- ఒడిశా నుంచి విశాఖకు వ్యాన్‌లో తరలిస్తుండగా పట్టుకున్న గొలుగొండ పోలీసులు



మీడియా సమావేశంలో స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుకున్న నిందితులతో డీఎస్పీ మోహన్‌రావు, సీఐ, ఎస్ఐలు

గొలుగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ, కృష్ణాదేవిపేట పోలీసులు గురువారం పెద్ద మొత్తంలో గంజాయి పట్టుకున్నారు. ఒడిశా నుంచి గొలుగొండ మండలం మీదుగా మైదాన ప్రాంతానికి రవాణా చేస్తున్న 450 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్‌రావు గొలుగొండ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా గొలుగొండ మండలం వైపు పెద్ద మొత్తంలో గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామం వద్ద గొలుగొండ ఎస్ఐ రామారావు, కృష్ణాదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు, పోలీసు సిబ్బంది గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కృష్ణాదేవిపేట వైపు నుంచి వస్తున్న ఐషర్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఇందులో వున్న ఇద్దరు వ్యక్తులతోపాటు గంజాయితో సహా వ్యాన్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. గంజాయిని తూకం వేసి 450 కిలోలు వున్నట్టు ... మిగతా 8వ పేజీలో

గంజాయిని అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు

- డీఐజీ గోపీనాథ్ జెట్టి



పోలీసు స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పోలీసులను ఆదేశించారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. గంజాయి, దొంగతనాలు, చీటింగ్ కేసుల పురోగతి గురించి అడిగారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, గంజాయి, ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇదే సమయంలో మహిళల భద్రత, సైబర్ క్రైమ్, ఇతర నేరాల గురించి కూడా అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు డీఐజీకి పోలీసులు గౌరవ వందనం చేశారు. డీఐజీ వెంట జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ ఎం.శ్రావణి, పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐలు ఉన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబవుతున్న చర్చిలు



సుందరంగా అలంకరించిన ఎలమంచిలి ఆంధ్ర సెంటినరీ బాప్టిస్ట్ చర్చి

ఎలమంచిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిలను ఇప్పట్నుంచే సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. పట్టణంలోని ఆంధ్ర సెంటినరీ బాప్టిస్ట్ చర్చిను ఇప్పటికే విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. చర్చిల్లో క్రైస్తవ సోదరులంతా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేలా మరిన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను

పాయకరావుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని మించి చేపట్టాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గడచిన ఆరు నెలల్లో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరా సుబ్రహ్మణ్యం, కశింకోట సత్తిబాబు, ముంజులూరి దుర్గాప్రసాద్, పి.సూరిబాబు, రాజాన ఆది, దొంగల శ్రీను, రత్నం, కుమార్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు కూలీల కొరత

కోటవురట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడింది. దీంతో కోసిన వరి పనలను కళ్లాలకు తరలించి కుప్పలు పెట్టలేక రైతులు పొలాల్లోనే వదిలేశారు. ఫలితంగా వరి పంట నీటిపాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో సగంపైగా రైతులు కోతలు కోశారు. బుధవారం రాత్రి నుంచి అల్పపీడనం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పలు గ్రామాల్లో రైతులు వరి కోతలు కోయలేదు. పలుచోట్ల కోసిన పనలను పొలాల్లోనే వదిలేశారు. దీంతో వరి పంట తీవ్రంగా దెబ్బతింటుందని రైతులు, అధికారులు అంటున్నారు. వరి పనలను తరలించేందుకు కూలీలు దొరక్కపోవడంతో కుప్పలు వేయలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండలంలో 50 శాతం మాత్రమే రైతులు వరి కోతలు కోసినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పలుగ్రామాల్లో ఇంకా వరి కోతలు కోయలేదు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న డ్వాక్రా మహిళలు

కోటవురట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వెలుగు కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ర్యాలీలో వెలుగు సీసీ వల్లి, ఏపీఎం సత్యవతి, మాణిక్యం, రమణమ్మ పాల్గొన్నారు.

గెడ్డపాలెంలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని గెడ్డపాలెంలో గురువారం సీపీఎం మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం సత్యనారాయణ పలువురి నేతలతో కలిసి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అప్పారావు, బోడపాటి లోవరాజు, చెక్క అప్పారావు, నాగేష్ పాల్గొన్నారు.

నేడు మునగపాకలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 20, 21 తేదీలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన వైసీపీ నేతల మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన జడ్పీ హైస్కూల్‌లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈనెల 21వ తేదీన మునగపాక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ ఉంటుందన్నారు. సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, ఆడారి కాశీబాబు, సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మునగపాక వసతిగృహం

- శిథిలావస్థకు చేరిన భవనం
- వృథాగా సోలార్ ప్యానళ్లు
- గతంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు పరిశీలన
- వినియోగంలోకి తేవాలని మండల వాసుల వినతి



శిథిలమైన మునగపాక ఎస్సీ వసతి గృహం



శిథిల భవనం గదిలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం

మునగపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం నిరుప యోగంగా ఉంది. ఒకప్పుడు విద్యార్థులకు కళకళలాడే భవనం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఎకరా స్థలంలో ఉన్న ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వివరాల్లోకి వెళితే..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మునగపాకలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని నిర్మించారు. ఎన్‌టీఆర్ (బీసీ) కాలనీలో నిర్మించిన వసతిగృహాన్ని 1988వ సంవత్సరంలో ప్రారంభించారు. వేలాది మంది దళిత బిడ్డలు ఇక్కడ విద్యాభ్యాసం చేశారు. 2016-2019 మధ్య కాలంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న వసతి గృహాలను సమీపంలో ఉన్న హాస్టళ్లలో విలీనం చేశారు. అందులో భాగంగా ఈ హాస్టల్‌ను వేరే చోటకు తరలించారు. ఆ సమయంలో ఫర్నిచర్, రికార్డులను తరలించిన అధికారులు సోలార్ ప్యానళ్లను మాత్రం వదిలివేశారు. అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. వాటిలో కొన్ని మాయమయ్యాయి. సుమారు ఎనిమిది సంవత్సరాలుగా వసతి గృహం ఖాళీగా ఉంది. దీంతో ఈ భవనంలో ఒక గదిలో కొన్నాళ్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని నడిపారు. వర్షానికి శ్లాబ్ కారడం, పెచ్చులు రాలడంతో వారు ఖాళీ చేశారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రెండు, మూడు గదులను వారి సేవలకు వినియోగించారు. వారు కూడా భవనం బలహీనంగా ఉందన్న విషయాన్ని గుర్తించి ఖాళీ చేసేశారు. ప్రస్తుతం మునగపాక ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంగా ఒక గదిని వినియోగిస్తున్నారు. మిగిలిన గదులు ఖాళీగా ఉండడంతో అసాంఘిక కలాపాలకు నిలయంగా మారింది. ఎకరాకు పైగా స్థలంలో వసతి గృహం ఉంది. అయితే 2016-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. తెలుగుదేశం నాయకులు ఈ భవనాన్ని పరిశీలించారు. తర్వాత అది కార్యరూపం దాల్చలేదు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కూటమి నాయకులు భేటీ అయిన సందర్భంలో మునగపాకలో జూనియర్ కళాశాల ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించారు. నిరుపయోగంగా ఉన్న ఇటువంటి భవనాన్ని కూల్చివేసి, కొత్త భవనాలు నిర్మించి జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కనకమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- నేడు లక్ష కుంకుమార్చన



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఎలమంచిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మవరం కనకమహాలక్ష్మి ఆలయంలో మూడో గురువారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక భక్తులతోపాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో వేలాది మంది భక్తులచే లక్ష కుంకుమార్చన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొఠారు సాంబ తెలిపారు.

నామినేటెడ్ పదవుల భర్తీలో అందరికీ సముచిత స్థానం

- టీడీపీ నేతలు పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల భర్తీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీకి సేవలందించిన వారికి అధినాయకత్వం అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వానికి సేవలందించిన అందరికీ సముచిత స్థానం దక్కుతుందన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదుకు మరో పది రోజులు మాత్రమే సమయం ఉందని, గడువులోగా లక్ష్యాన్ని అధిగమించేందుకు అందరూ సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. అనంతరం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ మాట్లాడుతూ టీడీపీ కుటుంబ సభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్, గవర కార్పొరేషన్ డైరెక్టరు భీమరశెట్టి శ్రీను, మాదిక కార్పొరేషన్ డైరెక్టరు డొక్కా నాగభూషణం, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు, జిల్లా కార్యదర్శి రాజాన సూర్యనాగేశ్వరరావు, నాయకులు కాండ్రకోట చిరంజీవి, పి. తులసీరామ్, ఇత్తంశెట్టి రాజు, జనపరెడ్డి నరసింగరావు, దిన్‌బాబు, దాడి ముసిలినాయుడు, రాజాన నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అదనపు భవనాలు ప్రారంభం



రాంబిల్లి: ఆసుపత్రి అదనపు భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో టొయోట్స్ రేర్ ఎర్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆసుపత్రులు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయకుమార్, కంపెనీ ప్రతినిధులను ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల శాఖ అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, మండల వైస్ ఎంపీపీ కొటాపు లక్ష్మి, స్థానిక సర్పంచ్ బంగారు చిలుకు, మాజీ సర్పంచ్ కొటాపు వడ్డీకాసులు, ఆసుపత్రి వైద్యులు ఆర్.వెంకటేష్, శావణి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి తరానికి దిక్సూచి సోలార్ రూఫ్ టాప్ పథకం

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకు వచ్చిన సోలార్ రూఫ్ టాప్ పథకం రేపటి తరానికి దిక్సూచిగా నిలుస్తుందని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం మండలంలోని తోటాడ పీఏసీఎస్ గోదాంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యుదుత్పత్తి ఖర్చుతో కూడినది కావడంతో తరచూ ఛార్జీలు పెరుగుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రధాని మోదీ ఈ పథకానికి రూపకల్పన చేశారన్నారు. తోటాడ గ్రామం మొదటి స్థానంలో నిలవాలంటే ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం 80 శాతం వరకు సబ్సిడీ కూడా ఇస్తుందన్నారు. ఎస్సీ ఎస్టీలకు పూర్తిగా ఉచితమన్నారు. హైవే రోడ్డు ఏర్పాటు చేస్తానన్నారు. అనకాపల్లి-అచ్యుతాపురం పూడిమడక రోడ్డును నాలుగు లేన్లగా మారుస్తామన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ మాట్లాడుతూ ఒక యూనిట్ విద్యుత్ తయారీకి 1.2 కేజీల బొగ్గు అవసరం పడుతుందని, దాని ప్రభావం వాతావరణంపై చూపుతోందన్నారు. ఉమ్మలాడ గ్రామంలో జీరో యూనిట్ విద్యుత్ వినియోగదారులను గుర్తించామని, వారికి సన్మానం చేయనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రచార గోడపత్రికను ఎమ్మెల్యే విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు, సర్పంచ్ దొడ్డి మంగవేణి,కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, బీజేపీ సీనియర్ నాయకుడు బద్దెం సూర్యనారాయణ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం : సుందరపు



తెరువుపల్లి సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం మునిసిపాలిటీలోని తెరువుపల్లి వార్డులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు, రెవెన్యూ సమస్యలను పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ సదస్సుల్లో వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తారన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వరహాలు, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

గ్రామాలలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దారు జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని నామవరంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి, విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 8 అర్జీలను స్వీకరించినట్టు తెలిపారు.కార్యక్రమంలో రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకుడు కురందాసు శివ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని చౌడువాడలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 20 అర్జీలను స్వీకరించినట్టు తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని, 40 రోజులు లోపు పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూముల రీ సర్వేలో దొర్లిన తప్పులను సరిచేస్తామన్నారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ గోపాలకృష్ణ, మండ సర్వేయర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వో భవానీ పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన ఫిర్యాదులన్నింటికీ ప్రాధాన్యత వుంటుందని, అన్ని భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ నర్సింహమూర్తి చెప్పారు. మండలంలోని చీడిక గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అడంగళ్లు, 1బీ రికార్డుల సవరణలు, భూముల ఆన్‌లైన్ తదితర అంశాలకు సంబంధించి ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో డీటీ అన్నాజీరావు, ఆర్ఐ కన్నబాబు పాల్గొన్నారు.

దళితుడికి గ్రామస్థులు చేయూత

ఎస్.రాయవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని గుర్రాజుపేటకి చెందిన పిట్టా రమణ అనే దళితుడికి గ్రామస్థులు అండగా నిలిచారు. ఆటో నడిపి కుటుంబాన్ని పోషించుకుంటున్న రమణ ఆరోగ్యం బాగోకపోవడంతో గ్రామస్థులు రూ. 14,600 నగదుతో పాటు నెలరోజులకు సరిపడా కిరాణా సరుకులను సమకూర్చారు. వాటిని గ్రామానికి చెందిన రాష్ట్ర యాత కమిటీ డైరెక్టర్ గుత్తుర్తి పాండురంగ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కురందాసు శ్రీనివాస్ చేతుల మీదుగా బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గొంప బుజ్జి, మునసా సత్తిబాబు, కొర్ని బంగారుకాసు, శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న రమణకు నగదు అందిస్తున్న మాజీ సర్పంచ్ కురందాసు శ్రీనివాస్, పాండురంగ తదితరులు

శ్మశాన వాటిక స్థలానికి పరిహారం చెల్లించాలని వినతి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిని అందిస్తున్న కాగిత గ్రామస్థులు

నర్సీపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కారిడార్ రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్న శ్మశాన వాటిక స్థలానికి పరిహారం ఇప్పించాలని నక్కపల్లి మండలం కాగిత గ్రామస్థులు నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సూర్యనారాయణకు గురువారం వినతి పత్రం అందజేశారు. కాగిత గ్రామంలోని ఎస్సీ శ్మశానవాటిక సర్వే నంబరు 223/2లో నుంచి కారిడార్ రోడ్డు ఏర్పాటు జరుగుతుందని, దీని వలన పదహారు సెంట్ల శ్మశాన వాటిక స్థలం పోతుందని వారు వివరించారు. సదరు భూమికి పరిహారంగా శ్మశాన వాటికను ఆనుకొని ఉన్న భూమిని లేదా నగదును ఇప్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎ.చంద్రరావు, ఎ.చంటి, దుర్గారావు, ఎ.ఆనంద్, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న తిరువీధి సేవ



మాఢవీధుల్లో స్వామి వారి తిరువీధి సేవ

నక్కపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉపమాక క్షేత్రంలో గురువారం స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. పెద్దపల్లకిపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను, చిన్నపల్లకిపై గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిలను మాఢవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జనసేన నేత తోట నగేశ్

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తేరు జడ్పీ హైస్కూల్‌లో గురువారం దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు, కుటుంబ సభ్యులు సహకారంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను జనసేన నేత తోట నగేశ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోవరాజు కుటుంబ సభ్యులు గ్రామంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను నగేశ్ అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ప్రగడ వీరబాబు, దేవవరపు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు చిట్టిబాబు, దేవవరపు శివరాజ్, రాము, సత్యనారాయణ, శ్రీనివాసరావు, నీటిసంఘం అధ్యక్షుడు గణసాల గంగేశ్వరరావు, గోనెల సత్తిబాబు, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రాంబిల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21, 22 తేదీల్లో నర్సీపట్నంలో జరగనున్న సీపీఎం 24వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగే ఈ మహాసభల్లో జిల్లాలోని ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకృష్ణ, కాశియ్య, నూకనత్నం, రాము, పవన్‌కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నీలబాబు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం

రాంబిల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేవీ కాలనీ వద్ద ఎన్ఏటీబీ పనులు చేస్తున్న ప్రదేశంలో ఈనెల 18న విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పరవాడకు చెందిన దొరాజియా కంపెనీ ఉద్యోగి బండారు నీలబాబు కుటుంబానికి ఆ కంపెనీ యాజమాన్యం రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వడానికి అంగీకరించిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, తాను కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరపడంతో నీలబాబు కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారంతో పాటు రూ.1లక్ష మట్టిఖర్చులు ఇవ్వడానికి ఒప్పందం జరిగిందని ఆయన తెలిపారు.

ట్రెండ్ మార్చిన హరిదాసులు



రిక్షాలో అక్షయపాత్ర ఉంచి తిరుగుతున్న హరిదాసులు

ఎలమంచిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాలంతో పాటు హరిదాసులు ట్రెండ్ మార్చారు. పట్టణంలో గురువారం ఇద్దరు హరిదాసులు అక్షయ పాత్రలను రిక్షాలో ఉంచి హరినామ సంకీర్తన చేస్తున్నారు. నెలగంట పెట్టిన దగ్గర్నుంచి ధనుర్మాసం నెలరోజులుపాటు తలపై అక్షయపాత్రను పెట్టుకుని హరినామ సంకీర్తన చేస్తూ వీధుల్లో ఇంటింటా తిరగడం ఆచారం. కానీ హరిదాసులకు వయస్సు పైబడడంతో రిక్షా సాయం తీసుకుని హరినామ సంకీర్తనలు చేస్తున్నారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం



తులసీనగర్ పాతవీధిలో రంధ్రం పడిన ఐరన్ విద్యుత్ స్తంభం

ఎలమంచిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్ పాతవీధిలోని ఐరన్ విద్యుత్ స్తంభం కింద భాగం తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడడంతో ఎప్పుడైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. నివాస ప్రాంతాల మధ్య ఉన్న ఈ విద్యుత్ స్తంభాన్ని తొలగించేందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాదం జరగక ముందే ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

'అవగాహనతో ప్రజారంజక పాలన'

మునగపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో ప్రజారంజక పాలన సులభతరం అవుతుందని స్థానిక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ పాలనపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించడం, వాటిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించడం ద్వారా అభివృద్ధి చేపట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ప్రసాద్, అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మండల సర్వ సభ్య సమావేశం రేపు

ఎలమంచిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 21 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కేఎస్. కొండలరావు తెలిపారు. ఎంపీపీ గోవిందరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

» కలెక్టర్ విజయకృష్ణన్



అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ప్రభుత్వపరంగా మెరుగైన సేవలందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. గురువారం 'ప్రశాసన్ గావ్ కి ఒరే' సుపరిపాలనపై కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వెబ్ కాస్టింగ్ ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధత కలిగిన పనితీరు చూపడం ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ప్రతి సోమవారం నిర్వహిస్తూ జవాబుదారీతనం ఉండేలా సుపరిపాలన అందిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ప్రశాసన్ గావ్ కి ఒరే క్యాంపెయిన్, గుడ్ గవర్నెన్స్ వీక్ నిర్వహించాలని పేర్కొన్నారు.

'సూర్య ఘర్'తో విద్యుత్ బిల్లులు ఆదా

» పథకాన్ని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

» ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ రామకృష్ణ

కశింకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని గృహ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకుని, తద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ రామకృష్ణ సూచించారు. గురువారం ఇక్కడి డివిజన్ కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉన్నా 1912కు కాల్ చేసి పరిష్కరించుకోవాలన్నారు. గృహ సోలార్ సిస్టం ఈ డివిజన్‌లో తొలుత బయ్యవరం, తోటాడ గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ మోటార్ల కోసం ఇప్పటి వరకు 50 దరఖాస్తులు వచ్చాయన్నారు. నూతన విద్యుత్ కనెక్షన్ల కోసం సంబంధిత సచివాలయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. మీ సేవ కేంద్రాల నుంచి కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. మొబైల్ అప్లికేషన్లను వినియోగదారులు తమ ఆండ్రాయిడ్, ఐఓస్ పరికరాల్లో కూడా వినియోగించుకునేందుకు అప్లికేషన్లు రూపొందించామని వివరించారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించడం, కస్టమర్ కేర్‌ను సంప్రదించడం, చెల్లించిన బిల్లుల వివరాలు తెలుసుకోవడం, విద్యుత్ సర్వీస్ వినియోగం వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఏఏవో మధు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పట్ల అమిత్‌షా వ్యాఖ్యలపై సీపీఎం నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకుల

అనకాపల్లి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను తక్కువ చేసి మాట్లాడారని ఆరోపిస్తూ సీపీఎం నాయకులు స్థానిక నెహ్రూచౌక్‌లోని ఆయన విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకుడు కాళ్ల తేలయ్యబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత పట్ల హోంశాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరును ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.రాజు, బి.ఉమామహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా దూదేకుల సమస్యలు పరిష్కరించాలి



జన గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి శుక్ర, శనివారాల్లో పెందుర్తిలో జరగనున్న జన గర్జనను విజయవంతం చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం జనగర్జన ఉత్తరాంధ్ర కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. గురువారం ఇక్కడ ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దామాషా లెక్కల ప్రకారం నూర్‌బాషా దూదేకుల కులాలకు సంక్షేమ పథకాలు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని కోరారు. పెందుర్తిలో నిర్మించిన సంఘ భవనాన్ని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రి ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. అలాగే జిల్లాలో తమ సంఘాలకు అన్నిచోట్ల శ్మశానవాటికల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు షేక్ ఇబ్రహీం, దావూద్ అలీ, కొండా సాహెబ్, బాజీ, ఎండీ హుస్సేన్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల వ్యర్థాలతో తాబేళ్ల మృత్యువాత

» బాధ్యులైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన

» బీజేపీ యువమోర్చ జిల్లా కార్యదర్శి మోసా రామకృష్ణ



తీరం ఒడ్డుకు కొట్టుకు వచ్చిన మృత తాబేలు (ఫైల్)

పరవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ వ్యర్థజలాలు సముద్రంలో కలవడం వలన ముత్యాలమ్మపాలెం తీరంలో తాబేళ్ల మృత్యువాత పడుతున్నాయని, తక్షణమే ఆయా యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని బీజేపీ యువమోర్చ జిల్లా కార్యదర్శి మోసా రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తిక్కవానిపాలెం తీరం నుంచి ముత్యాలమ్మపాలెం తీరం మీదుగా తంతడి వరకు తాబేళ్ల మృతిచెందిన సందర్భాలు ఇటీవల ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. గతంలో వ్యర్థ జలాల కారణంగా భారీ సంఖ్యలో చేపలు మృత్యువాత పడిన ఈ విషయాన్ని గుర్తు చేశారు. పరిశ్రమల నుంచి ఎక్కువ మోతాదులో వ్యర్థ జలాలను సముద్రంలోకి విడిచి పెట్టడం వలన ఈ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయమై పలుమార్లు మత్స్యశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. తక్షణమే అధికారులు తీరంలో పర్యటించి తాబేళ్ల మృతికి కారణమైన పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మత్స్యకారులతో కలిసి సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ మెయిన్‌గేట్ల వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

చిన్నవీధిలో చెప్పలేనన్ని సమస్యలు

» అసౌకర్యాల నడుమ లక్ష్మీనారాయణనగర్ మొదటి రోడ్డులో నివాసితులు

» జీవీఎంసీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లినా ఫలితం శూన్యమని ఆవేదన



లక్ష్మీనారాయణనగర్‌లో గల మట్టి రోడ్డు



రోడ్డుపై తిష్టవేసిన మురుగు నీరు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రింగురోడ్డులో గల లక్ష్మీనారాయణనగర్ మొదటి రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఈ మార్గంలో పలు కుటుంబాలు నివాసముంటున్నాయి. నిత్యం ఇక్కడ మురుగు రోడ్డుపై తిష్ట వేస్తుండడంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఇళ్ల నుంచి వెళ్లే కాలువ కళాశాల వెనుక ఉన్న మార్గంలో పూడుకు పోవడంతో వాడుక నీరు ముందుకు పారని పరిస్థితి నెలకొంది. దీంతో దోమలు బెడద అధికంగా ఉంది. కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించి ప్రధాన కాలువకు కలిపితే సమస్యకు చాలావరకు పరిష్కారం లభిస్తుంది. కానీ ఆ దిశగా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని నివాసితులంతా వాపోతున్నారు.

వీధి దీపాలు లేక చీకట్లు

ఇదిలావుంటే, ఈ మార్గంలో వీధి దీపాలు కూడా లేవు. దీంతో చీకటి పడితే రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇక్కడున్న స్కేటింగ్ పార్కుకు, గాంధీ పార్కుకు వచ్చే వారు సైతం అవస్థలు పడుతున్నారని అంటున్నారు. రాత్రివేళ కొందరు మద్యాన్ని సేవించి ఆ మత్తులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం మరింత భయాందోళన చెందాల్సి వస్తుందని చెపుతున్నారు.

పరిశుభ్రమైన తాగునీరు కరువు

జీవీఎంసీ పైపులైన్ ఇక్కడ లేకపోవడంతో పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉండడం లేదని అంటున్నారు. దీంతో తరచూ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాల్సిందిగా నివాసితులంతా కోరుతున్నారు. ఈ సమస్యలపై అనకాపల్లి జోన్ శానిటేషన్ సూపర్‌వైజర్ రవిని వివరణ కోరగా, తాను క్యాంప్‌లో ఉన్నానని వచ్చిన వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపడతానని స్పష్టం చేశారు.



కాలువలో కదలని మురుగు

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చండి

\- సంసుద్దీన్, కాలనీవాసి



మా నివాస ప్రాంతాల నుంచి డ్రైనేజీ వ్యవస్థ క్రమపద్ధతిలో లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపై నిలిచిపోతోంది. దోమల బెడద అధికంగా ఉంది. ఇక్కడి సమస్యలను ఇప్పటికి మూడు దఫాలుగా జీవీఎంసీ అధికారులకు విన్నవించాం. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

దోమల బెడద అధికంగా ఉంది

\- మల్లిక, గృహిణి



ఈ ప్రాంతంలో దోమల బెడద అధికంగా ఉంది. వాడుక నీరు ముందుకు పారే పరిస్థితి లేకపోవడంతో ఈ సమస్యల ఏర్పడింది. అలాగే, వీధి దీపాలు లేకపోవడంతో చీకటిపడితే అసాంఘిక కార్యక్రమాలు అధికమవుతున్నాయి. సిమెంట్ రోడ్డు నిర్మించి వీధి దీపాలను సైతం ఏర్పాటు చేయాలి.

పరిశ్రమల్లో ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి

» జిల్లా పోలీస్ సిబ్బంది శిక్షణ శిబిరం ముగింపోత్సవంలో రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



శిక్షణ పొందిన పోలీస్ సిబ్బందితో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్‌సిన్హా

పరవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాల పట్ల పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. ఇక్కడి ఫార్మాసిటీలోని మ్యూమవల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఏఎస్ఆర్ఎం) ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లా పోలీస్ సిబ్బందికి మూడు రోజులుగా 'రిస్క్ అసెస్‌మెంట్ ప్రివెన్షన్- మిటిగేషన్ ఇండస్ట్రీయల్ సేఫ్టీపై శిక్షణ తరగతులను నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపోత్సవంలో డీఐజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు వ్యూహాత్మకంగా ప్రమాదస్థలిలో చిక్కుకున్న కార్మికులను కాపాడాలన్నారు. అదే సమయంలో తమను తాము కూడా రక్షించుకోవాలన్నారు. తమ సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి సహకరించిన ఎంఏఎస్ఆర్ఎం ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ మల్లికార్జునరావు, పరిశ్రమల తనిఖీ అధికారులు జె.శివశంకర్‌రెడ్డి, జీవీవీఎస్ నారాయణ, కె.వీరభద్రరావు, ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ



పరవాడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐజీ, పక్కన ఎస్పీ

ఇదిలావుంటే, వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాతో కలిసి గురువారం పరవాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. తొలుత వీరు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, పెండింగ్ కేసుల వివరాలను డీఎస్పీ కేవీ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాలకు గురికాకుండా వాటిపై అవగాహన కల్పించాలన్నారు. గంజాయి రవాణా నియంత్రణకు చెక్ పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

దివ్యాంగుల అభ్యున్నతికి సమష్టిగా కృషి చేయాలి

» ప్రభుత్వం వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి : ఎంఈవోల సమావేశంలో డీఈవో అప్పారావునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల అభ్యున్నతికి అందరూ కృషి చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావునాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఇక్కడి జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో ఎంఈవోలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల అమలు తీరును ఎంఈవోలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు అందుతున్నదీ లేనిదీ ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జగదీష్ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన అన్ని రకాల ఉపకరణాలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వాటిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ డీఈవో అప్పారావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో దివ్యాంగుల నమోదు, పాఠశాలలో వారికి కల్పిస్తు సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎస్‌సీ కో-ఆర్డినేటర్ గిరి, సమగ్రశిక్ష జిల్లా సహిత విద్యా కో-ఆర్డినేటర్ బి.శకుంతల, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అర్జీ సమర్పిస్తే నిర్దేశిత సమయంలో భూ సమస్య పరిష్కారం

» రెవెన్యూ సదస్సులో పరవాడ, సబ్బవరం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు సురేష్, గణపతిరావు



అజనగిరి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు

పరవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేష్ అన్నారు. మండలంలోని ఈ.మర్రిపాలెంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమస్యలపై అర్జీలు సమర్పిస్తే 45 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం పలువురు అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, స్థానిక నాయకులు దుల్ల రామునాయుడు, ఇల్లపు ప్రసాద్, వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అజనగిరిలో...

సబ్బవరం : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు స్పష్టం చేశారు. జీవీఎంసీ 88వ వార్డు అజనగిరి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. భూములకు సంబంధించిన అన్ని రకాల సమస్యలు నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. గ్రామంలో 25 సర్వే నెంబర్లలో 661.33 ఎకరాలు భూమి ఉండగా, జిరాయితీ 94.62, ఎకరాలు ప్రభుత్వ భూమి 64.33 ఎకరాలు, అడవి పోరంబోకు 502.30 ఎకరాలు ఉన్నట్టు చెప్పారు. అనంతరం పలువురు అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎల్అప్పారావు, సచివాలయ సర్వేయర్లు లోకేష్, రాంబాబు, వీఆర్వో వినోద్, జనసేన జిల్లా కార్యదర్శి ఇందలి వెంకటరమణ, గ్రామ పెద్దలు బలిరెడ్డి అప్పలనాయుడు, నారపిన్ని సన్నిబాబు, బొడ్డపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

» డీఎఫ్‌వో శామ్యూల్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో శామ్యూల్

గొలుగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు డీఎఫ్‌వో ఎం.శామ్యూల్ తెలిపారు. గొలుగొండ గల కలప డిపోలో గురువారం టేకు కలప వేలం నిర్వహించారు. ఈ ప్రక్రియను పరిశీలించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు.

జిల్లాలో గల అటవీ ప్రాంతాల్లో జనవరి నుంచి ఎండిన ఆకులకు ముందుగా నిప్పంటించి, చెట్లకు ఎటువంటి నష్టం కలగకుండా చూస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో ప్రజలకు అడవి జంతువుల సంరక్షణ, అటవీ ప్రాంత పరిరక్షణ తదిరాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

వచ్చే ఏడాది ఐదు లక్షల మొక్కల పెంపకం లక్ష్యం

ఇదిలావుంటే వచ్చే ఏడాది సీజన్‌లో ఐదు లక్షల వివిధ రకాలైన మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని డీఎఫ్‌వో వివరించారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో ధన్వంతరీ వనంతో పాటు ఎలమంచిలి మండలంలోని వేమగిరి గ్రామంలో రెండు కోట్ల రూపాయల నిధులతో నగర వనాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనికి నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. అడవుల పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్, రేంజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూర్మావతారంలో వెంకన్న దర్శనం



కశింకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఇక్కడి వెంకటేశ్వర ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులకు ఓ అవతారంలో స్వామివారు దర్శనమిస్తున్నారు. గురువారం కూర్మావతారంలో గోవిందుడు దర్శనమివ్వడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు రేజేటి శ్రీరామా చరణాచార్యులు, రేజేటి మారుతి వెంకటాచార్యుల ఉదయం నుంచి విశేష అర్చనలు, అభిషేకాలు జరిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు సబ్బవరం హైస్కూల్ విద్యార్థిని ఎంపిక



ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థిని లాస్య

సబ్బవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న లాస్య జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎస్.తిరుపతిరావు గురువారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాల బాలికల ఖోఖో పోటీల్లో సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. దీంతో ఈ నెల 21 నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఆయోధ్యలో జరగ నున్న జాతీయ పోటీల్లో రాష్ట్రం తరఫున లాస్య తలపడనుందని వివరించారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయ సిబ్బంది పి. రాధాకుమారి, అబ్దుల్ రెహ్మాన్‌లతో పాటు పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ శంకరరావు, వైస్ ఛైర్మన్ జ్యోతి, తదితరులు అభినందించారు.

ముసురు వాతావరణంతో జనం అవస్థలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావం కారణంగా అనకాపల్లి, పరసర మండలాల్లో ముసురు వాతావరణం నెలకొంది. గత రెండు రోజులు నుంచి అడపాదడపా చిరుజల్లులు కురుస్తుండడంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. గురువారం తెల్లవారుజాము, సాయంత్రం పట్టణంలో చిరుజల్లులు కురిశాయి. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో చిరు వ్యాపారులు, విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులపై వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

'స్మార్ట్ మీటర్లతో ప్రజలపై అదనపు భారం'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై విద్యుత్ భారం మరింత పడుతుందని సీపీఎం, రైతు సంఘం నాయకులు ఆరోపించారు. స్మార్ట్‌మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేయాలని, ప్రజలంతా దీనిని వ్యతిరేకించాలని పేర్కొంటూ గురువారం గవరపాలెంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రా లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు కాళ్ల తేలయ్యబాబు, పెంటకోట శ్రీనివాసరావు, చింతా ఓంశివ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం పూర్తికి నిధులు



విద్యార్థుల సామర్థ్యాలు తెలుకుంటున్న ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిన్నెలకోట పంచాయితీ బొంగజంగి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తున్నట్టు ఎంపీడీవో పూర్ణయ్య తెలిపారు. గురువారం జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబుతో కలసి బొంగజంగి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గిరిజనులకు అడిగి తెలుసుకున్నారు. 47 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల భవనం పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో పలువురు ఉపాధి జాబ్ కార్డులు లేవని, జన్మాన్ గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికుడు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం



రింతాడలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు రామకృష్ణ

కొయ్యూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దారు ప్రసాద్ కోరారు. గురువారం మర్రివాడ పంచాయతీలో ఎంపీటీసీ సభ్యురాలు గంగా భవాని అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎంపీపీ జి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఇందులో భాగంగా భూ సంబంధ సమస్యలపై 114 వినతులు స్వీకరించారు. వీటిలో అధికంగా మ్యూటేషన్‌లు 83, ఎఫ్‌లైన్‌కు సంబంధించి 6, డీ పట్టాలకు గానూ 19, భూ తగాదాలు 4 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీటీ కుమార్ స్వామి, రీ సర్వే డీటీ అప్పన్న, సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బందిపాల్గొన్నారు.

కొనుగోలు భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి: తహసీల్దార్

గూడెంకొత్తవీధి: పట్టాదారుడు నుంచి కొనుగోలు చేసిన భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం రింతాడ గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో భూముల రిజిస్ట్రేషన్ 1908 సెక్షన్ 17 ప్రకారం జరుగుతుందన్నారు. భూముల క్రయ, విక్రయాలు గిరిజనుల మధ్యనే జరగాలన్నారు. దస్తావేజులో ఇద్దరు వ్యక్తులు గ్రామస్థుల సమక్షంలో అంగీకారంతో రాయించుకున్న పత్రాలు రిజిస్ట్రేషన్‌కి పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ దుమంతి సత్యనారాయణ, ఆర్ఐ మహదేవ్, సీనియర్ అసిస్టెంట్ చిన్నయ్యపడాల్, సర్వేయర్ శ్రీను, వీఆర్వో సురకత్తి కృష్ణారావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ హామీ



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ సరేష్‌కుమార్, గ్రామస్థులు

పెదబయలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూడకోట పంచాయితీ పరిధి పెదకొండా, బడంబీరు, రుండలంపుట్టు గ్రామాలకు పక్కా రహదారి నిర్మాణానికి కలెక్టర్ దినేష్‌కుమార్ హామీ ఇచ్చారు. రహదారి సమస్యపై ఆయాల గ్రామాల ప్రజలు 50 మంది సర్పంచ్ సురేష్‌కుమార్, ఎంపిటీసీ సంగీతలతో కలసి కలెక్టర్‌కు వినతి పత్రమిచ్చారు. రోడ్డు సౌకర్యం లేక ఇవస్థలు పడుతున్నామని తెలిపారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఆ గ్రామాలకు పక్కా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లోకి వైసీపీ నేత

పెదబయలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొర్ర తమన్న గురువారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ నేత బుల్లిబాబు ఆయనకు కండువా వేసి పార్టీకిలోకి ఆహ్వానించారు. మండలంలో బలమైన ఓటు బ్యాంక్ కలిగిన పీవీటీజీ సామాజిక వర్గానికి చెందిన తమన్న ప్రస్తుతం వైసీపీ అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ జిల్లా ప్ర ధాన కార్యదర్శిగా ఉన్నారు.ఈయన సతీమణి సోభారాణి కిముడుపల్లి సర్పంచ్ కావడంతో అధికారిక కార్యక్రమాలలో తప్పా వైసీపీ సమావేశాల్లో కానరావడంలేదు.

యువతపై గంజాయి రవాణా కేసులు అన్యాయం

» సీపీఐ నేత విష్ణుమూర్తి ఫిర్యాదు

పాడేరు రూరల్/ సీలేరు, డిసెంబరు 19 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలంలో పలు పంచాయతీల్లో గంజాయి పేరుతో గిరిజన యువతపై అ క్రమంగా కేసులు నమోదు చేయడం తగదని గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి అన్నారు. ఈమేరకు పాడేరులో కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి విలేకరులతో మాట్లాడుతూ, జీకేవీధి మండలంలో ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ, పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో గిరిజన యువతపై గంజాయి రవాణాలో సంబంధం లేకున్నా అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గతంలో ఈ ప్రాంతంలో గంజాయి సాగు చేసినప్పటికీ కొన్నేళ్లుగా ఈ సాగుకు దూరంగా ఉన్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గంజాయి నిర్మూలనకు తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రాంత ప్రజలు కట్టుబడి ఇతర పంటలు సాగుతున్నారు. గు మ్మరేవుల పంచాయతీ నేలజర్ల గ్రామానికి చెందిన సుంకరి బుజ్జిబాబు అనే వ్యక్తిని ఆగస్టు 13న రంపచోడవరం పోలీసులు మాట్లాడాలని బలవంతంగా జీపులో తరలించి గంజాయి కేసు బనాయించారన్నారు. దారకొండ పంచాయతీ చిలకలమామిడికు చెందిన కొర్రా నారాయణ కోసం వచ్చిన పోలీసులు ఆయన లేకపోవడంతో గుంట రాజు, కొర్ర కర్లను మారేడుమిల్లి తీసుకువెళ్లి కేసు నమోదు చేశారన్నారు. ఎక్కడో జరిగిన సంఘటనల ఆధారంగా తీసుకుని సంబంధం లేనటువంటి యువకులపై గంజాయి కేసులు బనాయించడం అన్యాయమన్నారు.అనేక మందిపై ఇలాంటి అక్రమ కేసు లు నమోదై జైళ్లలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనివల్ల యువత భవిష్యత్తు నాశనం కాకుండా చూడాలని కలెక్టర్‌ను కోరామన్నారు. లేకుంటే ఉద్యమిస్తామని విష్ణుమూర్తి హెచ్చరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సుంకరి విష్ణుమూర్తి

అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కొయ్యూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు ఆయా పోస్టులు భర్తీకి అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో విజయకుమారి తెలిపారు. ఆడాకుల పంచాయతీ బి. కొత్తూరు, బూదరాళ్ల పంచాయతీ దడవగొయ్యి, పోతురాజుగుమ్మాలు/రాజులపాడు, రాజేంద్రపాలెం పంచాయతీ జోగుంపేట, ల లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని స్థిర నివాసులైనవారు 10 వ తరగతి ప్యాసై ఉండి 21-35 సంవత్సరాల ఎస్టీ కులాలకు చెందిన వివాహిత మహిళలు అర్హులన్నారు. ఈ నెల 20 నుంచి 31వ తేదీ లోపు శిశు అభివృద్ధి పథక అధికారి వారి కార్యాలయానికి పోస్టు ద్వారా కానీ, నేరుగా కానీ దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సూచించారు.

చింతపల్లి మండలంలో..

చింతపల్లి: ఎనిమిది అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో డేగలపాలెం (కొత్తపాలెం), సోమరవీధి (చౌడుపల్లి), పెదగొంది (పెదబరడ), రాళ్లగెడ్డకొత్తూరు (కుడుముసారి), సుర్తిపల్లి (బలపం), గొప్పుగుడిసెలు (కుడుముసారి), జడుగూరు (కుడుముసారి), పిన్నపాడు (కొత్తపాలెం) అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగావున్నాయన్నారు. ఆసక్తిగల స్థానిక మహిళలు ఈనెల 31తేదీ సాయంత్రంలో ప్రాజెక్టు కార్యాలయంలో నేరుగా గాని, పోస్టు ద్వారాగానీ దరఖాస్తులు అందజేయాలన్నారు.

జి. మాడుగుల మండలంలో..

జి.మాడుగుల: మండలంలోని అంగన్‌వాడీ సహాయక (ఆయా) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో సువర్ణమ్మ తెలిపారు. వంతాల పంచాయతీ పెదవలస, సొలభం పంచాయతీ గెమ్మెలిబరు, వంజరి పంచాయతీ చితలపాడు, కర్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకు స్థానిక మహిళాల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఆమె గురువారం ఒక ప్రకటనలో కోరారు.

గూడెంకొత్తవీధిలో

గూడెంకొత్తవీధి: తొమ్మిది అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు సీడీపీవో లక్ష్మీదేవి తెలిపారు. మండలంలో అరటిచెట్లవీధి (రింతాడ) డి.కొత్తూరు (జీకేవీధి), బొర్రమామిడి (దామనాపల్లి), పిల్లిగొంది (లక్కవరపుపేట), ఈతలబంద (వంచుల), కొత్తపల్లి (జీకేవీధి), తీములగుంట (వంచుల), మాలిగూడ (జీకేవీధి), టంగలగొంది(జీకేవీధి) కేంద్రాల్లో ఆయా పోస్టుకు స్థానిక గిరిజన మహిళలు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డుంబ్రిగుడ

డుంబ్రిగుడ: మండల పరిధిలోని అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీడీపీవో నీలిమ తెలిపారు. బలియగుడ, సాయినగర్, కాగువలస, కూడా, బుడ్డింగి కేంద్రాల్లో ఆయా పోస్టులకు భర్తీ చేయనున్నట్టు తెలిపారు.

హుకుంపేటలో

హుకుంపేట: మండలంలోని పాతకోట పంచాయతీ ఎగరూడి, చికుమదుల పంచాయతీ కారేగరువు, తడిగిరి పంచాయతీ ఎ. బోడ్డపుట్టు గ్రామంలో అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో బాలమాణి తెలిపారు. కేవలం ఎస్టీ అభ్యర్థినులు మాత్రమే అర్హులనిఅన్నారు.

'మా తోట' ద్వారా కాఫీ రైతులకు గరిష్ఠ ధరలు

» సీఈవో చిన్నారావు



రైతుల వద్ద కాఫీ పండ్లను కొనుగోలు చేస్తున్న మాతోట ఎఫ్‌పీవో సిబ్బంది

చింతపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు పండించి కాఫీకి మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘం గరిష్ఠ అందిస్తున్నట్టు సీఈవో వనపల చిన్నారావు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మూడేళ్లగా మాతోట ఎఫ్‌పీవో కాఫీ మార్కెటింగ్ ప్రారంభించిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ఆధారంగా రైతులకు గరిష్ఠ ధరలు అందిస్తున్నట్టు చెప్పారు. మార్కెట్ ప్రారంభంలో కిలో కాఫీ పండ్లకు రూ.45 ధరను ప్రకటించామన్నారు. ప్రస్తుతం కాఫీ ధరలు పెరగడంతో ప్రస్తుతం కిలో పండ్లకు రూ.50గా బోర్డు డైరెక్టర్లు నిర్ణయించినట్టు చెప్పారు. మాతోట ఎఫ్‌పీవో సిబ్బంది కాఫీ పండ్లను గృహాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తారన్నారు. బాగా పండిన ఏ గ్రేడ్ పండ్లను పెంటపాడు పల్పింగ్ యూనిట్ వద్దకు తీసుకొచ్చి విక్రయిస్తే కిలోకి రూ.60 ధర చెల్లిస్తామన్నారు. గిరిజన రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోరాదన్నారు. రైతులు పూర్తి సమాచారం కోసం ఫోన్: 94941 47389 చేయాలన్నారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ వద్దు



సీలేరులో నిరసన తెలుపుతున్న జెన్‌కో ఉద్యోగులు

సీలేరు, డిసెంబరు 19, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు గురువారం జీకేవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కో ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఏపీ జెన్‌కో సూపరిండెంటెండ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు ఆ ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సేవ్ పవర్ సెక్టార్.. సేవ్ ఇండియా, విద్యుత్ సవరణ చట్టం-2022 బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలను నిలిపివేయాలన్నారు. డిస్కమ్ ఫీడర్‌లను ప్రైవేట్‌కు ఇచ్చే ఆలోచనలను వెంటనే విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 1104, 327, తెలుగునాడు సీఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు వై. సత్తిబాబు, ఈవీవీ సత్యనారాయణ, జి. శివప్రసాద్, భవానీ శంకర్ పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌లో..

ముంచంగిపుట్టు: ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం ఎదుట ఉద్యోగులు గురువారం ఆందోళన చేపట్టారు. విద్యుత్ ప్రాజెక్టుల ప్రైవేటీకరణ ప్రక్రియను విరమించుకోవాలని కోరుతూ, ఎస్ఈ కార్యాలయం ఆవరణలో ధర్నా చేశారు. భోజన విరామం సమయంలో నల్ల రిబ్బన్లుధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్మిక నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్, ఛండీగఢ్ రాష్ట్రాల్లో విద్యుత్ బోర్డులను ప్రైవేటీకరణ చేయడానికి రంగం సిద్ధం చేయడం శోచనీమన్నారు.



మాచ్‌ఖండ్‌లో ఆందోళన చేస్తున్న ప్రాజెక్టు ఉద్యోగులు

సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ జమ



గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏవో

చింతపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల వద్ద తీసుకున్న పంట రుణాలు సకాలంలో చెల్లించిన రైతులకు ప్రభుత్వం వడ్డీ వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేస్తున్నట్టు స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం యూబీఐ, గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్లతో ఈ విషయంపై ఏవో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూబ్యాంక్‌ల ద్వారా రైతులు తీసుకున్న పంట రుణాలు అసలు, వడ్డీ కలిపి నిర్ణీత సమయంలో కట్టిన సమాచారం బ్యాంక్ మేనేజర్లు పోర్టల్‌లో నమోదు చేయాల్సిఉందన్నారు. ఈ విధంగా రైతులు వివరాలు ఈనెల 31 తేదీలోగా నమోదు చేస్తే రైతులు తీసుకున్న రుణానికి చెల్లించిన మొత్తం వడ్డీ ప్రభుత్వం వ్యక్తిగత ఖాతాలో జమ చేస్తుందన్నారు. బ్యాంక్ మేనేజర్లు సకాలంలో రుణాలు చెల్లించిన రైతుల జాబితాను పోర్టల్‌లో నమోదు చేస్తామని చెప్పారన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు స్ర్కీనింగ్ పరీక్షలు

» డీఎంహెచ్‌వో జమీల్ బాషా



పాఠశాల విద్యార్థినులకు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

పాడేరురూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఎస్‌కేలో ప్రతీ విద్యార్థీ ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో వారికి స్ర్కీనింగ్ పరీక్షలను చేపడుతున్నట్టు డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా తెలిపారు. జిల్లాలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 3,214 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,01,633 మంది పిల్లలు ఉన్నారన్నారు. 3,124 ఎంపీపీ, ఎంపీయూపీ, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల్లో 1,99,993 మందిఉన్నారన్నారు. 64 పీహెచ్‌సీల పరిధిలో ఉన్న ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు కలిసి ప్రతీ గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యార్థులకు స్కూళ్లల్లో ప్రతీ శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు అంగన్‌వాడీల వద్ద, మధ్యాహ్నం స్కూల్స్‌లో విద్యార్థులకు స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తారన్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి సమీపంలో ఉన్న పీహెచ్‌సీలకు రిఫర్ చేస్తారన్నారు. డి-4 లకు సంబంధించిన పిల్లలను డీఈఐసీ, జీజీహెచ్ పాడేరు, టీఈ ఐసీ ఏరియా ఆస్పత్రి రంపచోడవరం పంపించాలని ఆదేశించామన్నారు. ఈమేరకు జనవరి 5వ తేదీ నాటికి వాహన సదుపాయాలను సమకూర్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటి వ రకు 1,532 అంగన్వాడీ కేంద్రాలలో 34,501 మంది పిల్లలకు, 3,124 స్కూల్స్‌లో 93,264 మంది పిల్లలకు స్ర్కీనింగ్ టెస్టులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పిల్లలకు మార్చి 31వ తేదీలోగాపూర్తి చేయనున్నట్టు చెప్పారు.

క్షతగాత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



క్షతగాత్రుని భార్యకు చెక్ అందిస్తున్న ప్రసాద్ తదితరులు

కొయ్యూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమా దంలో గాయపడి ప్రస్తుతం వైద్య సేవలు పొందుతున్న క్షతగాత్రుని కుటుంబానికి మేము న్నాము ట్రస్టు ప్రతినిధి అనిశెట్టి చిరంజీవి రూ. 50 వేలు జీసీసీ మాజీ ఛైర్మన్ చేతుల మీదుగా గురువారం బాధితుని భార్యకు అందించారు. అనిశెట్టి చిరంజీవి దంపతులు ఆ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ. 5 వేలు అందచేశారు. అనంతరం గురువారం డౌనూరు వెళ్ళి బాలింత అయిన క్షతగాత్రుని భార్యకు ఈ చెక్‌ను టీడీపీ నేత ఎంవీవీ ప్రసాద్ ద్వారా అందచేశారు. అలాగే, 50 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు ఇచ్చారు. ఈ చిరంజీవి సతీమణి లక్ష్మి, నేతలు కాకురు చంద్రరావు, బుద్ధరాజు శివరామరాజు, రొంగలి గోవిందు, మాకాడ బాలరాజు, కిముడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి



మృతుడు రాంబాబు (ఫైల్)

పాడేరురూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడేరు మండలం కిండంగిపంచాయతీ సేరుబయలు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త, పెసా గ్రామ కమిటీ అధ్య క్షుడు కూడా గంగాధర్ (40) (రాంబాబు) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్వగ్రామంలో ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియలను ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రాంబాబు బుధవారం ద్విచక్ర వాహనంపై వస్తుండగా వంతాడపల్లి వద్ద ప్రమాదవశాత్తు పడిపోవడంతో తలపై బలమైన గాయం తగిలి మృతి చెందారు. గురువారం సేరుబయలులో ఆయన అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, మాజీ ఎంపీపీ ఎస్వీరమణమూర్తి, తెలుగు యువత అధ్యక్షుడు డి.విశ్వనాథం, నాయకులు బుక్క జగదీష్, గుజ్జెలి కనకరాజు, ఎం.పాలవెల్లి, కూడా రాజేష్, భూపాల్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఆక్రమణలపై నోటీసులు జారీ

హుకుంపేట డిసెంబరు19 ఆంధ్రజ్యోతి; మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు ఆ క్రమించిన వారికి తహసీల్దార్ డిప్రకాష్ ఆదేశాల మేరకు రివెన్యూ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. మెయిన్ రోడ్డుపై ఉన్న నోటీసులు అంతికించారు. 15 రోజులలో స్థలాలకు చెందిన హక్కు పత్రాలుంటే తహసీల్దార్‌కు చూపాలన్నారు. లేకుంటే ఆ క్రమణలు తొలగిస్తామన్నారు

కదిలిన గిరిజనం..

» శ్రమదానంతో ఒనుకొండ గ్రామ రహదారికి మరమ్మతులు



గోతులను బండరాళ్లతో నింపుతున్న గిరిజనులు

అనంతగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంగుపర్తి పంచాయతీ ఒను కొండ గ్రామ రహదారి మరమ్మతులను గురువారం గిరిజనులు శ్రమదానంతో చేపట్టారు.

ఈ గ్రామానికి వెళ్లేందుకు రెండేమార్గాలు. ఒకటి గెడ్డలు దాటుకుంటూ.. లేదా అంతంతమాత్రంగా ఉన్న మట్టిరోడ్డుపై ప్రయాణించాలి.. వర్షాలతో గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రస్తుతం మట్టిరోడ్డుపైనుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు మరీ అధ్వానంగా మారడంతో అత్యవసర పరిస్థితిలో గ్రామానికి ద్విచక్ర వాహనం సైతం వెళ్లే అవకాశం లేదు.. ఈ స్థితిలో గురువారం ఉదయం నుంచి గిరిజనులు శ్రమదానంతో రోడ్డును బాగుచేశారు. గోతులున్న చోట్ల బండరాళ్లతో నింపి, మట్టిని పోశారు. ప్రస్తుతానికి తాత్కాలిక పనులు చేపట్టారు. ఇకనైనా అధికారులు స్పందించి, తారురోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

గంజాయి సాగు, రవాణా కట్టడికి చర్యలు: డీఎస్పీ



పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ షహబాజ్ అహమ్మద్

చింతపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో గంజాయి సాగు, రవాణా కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్ తనిఖీ చేశారు. క్రైమ్ రికార్డులు, కేసుల తాజా పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి వ్యాపారులు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి, ఏపీలోని గిరిజన ప్రాంతం మీదుగా మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. ఈ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలన్నారు. సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నా రు. పోలీసు అధికారులు గిరిజన గ్రామాలను సందర్శించి ఆదివాసీలతో మమేకం కావాలని సూచించారు. గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. చింతపల్లి, లం బసింగి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శని, ఆదివారాల్లో లంబసింగిలో గస్తీని పెంచాలన్నారు. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం. వినోద్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత



బూసుకొండలో అవగాహన కల్పించిన సీలేరు అటవీశాఖ అధికారులు

సీలేరు, డిసెంబరు 19, (ఆంధ్రజ్యోతి): అడవుల్లో అగ్ని ప్రమాదాల వలన విలువైన వృక్ష సంపద నాశనం అవుతుందని, ఈ స్థితి ఈ ప్రమాదాల నివారణపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని అటవీశాఖ సీలేరు రేంజ్ అధికారి వెంకటరావు , డిప్యూటీ రేంజ్ అధికారి సీహెచ్ సింహాచలంపడాల్ అన్నారు. జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని బూసుకొండ గ్రామంలో గిరిజనులకు అడవుల్లో అగ్ని నివారణ, వన్య ప్రాణ/ల సంరక్షణ చర్యలపై గురువారం అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ అడవుల్లో అగ్ని ప్రమాదాలతో విలువైన వృక్ష సంపద నాశనం అవుతుందన్నారు. అదేవిధంగా చెట్లు నుంచి రాలిన ఆకులు, అలములు కాలిపోవడంతో భూ సారం నశించిపోతుందన్నారు. పర్యావరణ , సమతుల్యత దెబ్బతింటుందని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో కాల్చేసిన సిగరెట్లు, బీడీలు, మంటలకు సహకరించే వస్తువులను అడవుల్లో పడేయరాదన్నారు. సీలేరు బీట్ ఆఫీసర్ ఆర్. రాకేశ్‌కుమార్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ కె. దుర్గాప్రసాద్, దుప్పులవాడ మాజీ సర్పంచ్ కేలేబు చెల్లయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న వినియోగదారుల సంఘం నాయకులు

జి.మాడుగుల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బి.చిట్టిబాబు సూచించారు. ఈ నెల 24వ తేదీన వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారుల దినోత్సవంపై విద్యార్థులకు వ్యాసరచన, వంటి పలు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు సంఘం నాయకులు జి.నూకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అంబలం పూజ



జోలాపుట్‌లో నిర్వహిస్తున్న అంబలం పూజ

ముంచంగిపుట్టు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోలాపుట్టులో బుధవారం రాత్రి జోలాపుట్టు అయ్యప్ప సేవాపీఠం ఆధ్వర్యంలో అంబలం పూజ ఘనంగా జరిగింది. గణపతి, కుమారస్వామి, మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి అభిషేకాలు చేశారు. అయ్యప్ప స్వాములు ఆలపించిన భక్తి గీతాలు ఆలపించారు. ఈ అంబలం పూజలో విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్య సూత్రాలు పాటిస్తే పలు వ్యాధులకు దూరం

ముంచంగిపుట్టు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉంటామని కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ చివుకుచింత గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 58 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న ఐదుగురికి రక్త పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు ఖండన

పాడేరురూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన చర్చలో బీఆర్.అంబేద్కర్‌ను కించపరి, దేశ ప్రజల మనో భావాలను దెబ్బతీసేలా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వాఖ్యలను సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్.ధర్మానపడాల్, పి.బాలదేవ్‌లు వేరువేరు ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాకు హోం మం త్రిగా కొనసాగే హక్కులేదని భావిస్తున్నామన్నారు. పార్లమెంట్ సాక్షిగా మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

స్పీకర్‌ను కలిసిన అన్నవరం దేవస్థానం ఈవో

▸ బలిఘట్టం సత్యదేవుని ఆలయం అభివృద్ధిపై చర్చ


స్పీకర్ అయ్యన్నతో అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు తదితరులు

నర్సీపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.సుబ్బారావు గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రుడును మర్యాదపూర్వంగా కలిశారు. నర్సీపట్నంలోని బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకున్న నేపథ్యంలో స్పీకర్‌ను కలిసేందుకు ఈవో ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి ఆలయంలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు, మంగళి, చాకలి, స్వీపర్, వాచ్‌మెన్‌ల జీతభత్యాలు అన్నవరం దేవస్థానం చెల్లించేలా చర్యలు చేపట్టాలని స్పీకర్ ఆయనకు సూచించారు. అనంతరం బలిఘట్టంలోని సత్యదేవుని ఆలయాన్ని ఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీ చంద్రశేఖర్, పీఆర్‌వో కొండలరావు, సూపరింటెండెంట్ రమణ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఈవో దివ్యతేజ, ఆలయ అర్చకులు భద్రాచల రామం తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలానికి పరిహారం చెల్లించాలని వినతి


సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిని అందిస్తున్న కాగిత గ్రామస్థులు

నర్సీపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కారిడార్ రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్న శ్మశాన వాటిక స్థలానికి పరిహారం ఇప్పించాలని నక్కపల్లి మండలం కాగిత గ్రామస్థులు నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సూర్యనారాయణకు గురువారం వినతి పత్రం అందజేశారు. కాగిత గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటిక సర్వే నెంబరు 223/2లో నుంచి కారిడార్ రోడ్డు ఏర్పాటు జరుగుతుందని, దీని వలన పదహారు సెంట్ల శ్మశాన వాటిక స్థలం పోతుందని వారు వివరించారు. సదరు భూమికి పరిహారంగా శ్మశాన వాటికను ఆనుకొని ఉన్న భూమిని లేదా నగదును ఇప్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎ.చంద్రరావు, ఎ.చంటి, దుర్గారావు, ఎ.ఆనంద్, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ప్రభుత్వపరంగా మెరుగైన సేవలందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. గురువారం 'ప్రశాసన్ గావ్ కి ఒరే' సుపరిపాలనపై కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వెబ్ కాస్టింగ్ ద్వారా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధత కలిగిన పనితీరు చూపడం ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ప్రతి సోమవారం నిర్వహిస్తూ జవాబుదారీతనం ఉండేలా సుపరిపాలన అందిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ప్రశాసన్ గావ్ కి ఒరే క్యాంపెయిన్, గుడ్ గవర్నెస్ వీక్ నిర్వహించాలని పేర్కొన్నారు.

గంజాయి రవాణాను నియంత్రించాలి

చోడవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాలో భాగమవుతున్న యువతను దీనినినుంచి దూరంగా చేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని హోం శాఖ మంత్రి అనితకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం విశాఖలో మంత్రి అనితను కలిసిన రాజు, నియోజకవర్గంలో గంజాయి ఇతర మాదకద్రవ్యాల వినియోగం, రవాణాలో యువత అమాయకంగా వెళ్లి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువతను తప్పుదారిలోనికి నడిపిస్తున్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, యువత భవిష్యత్తు దెబ్బతినకుండా చూడాలని ఆయన కోరారు.


హోంమంత్రి అనితతో జనసేన ఇన్‌చార్జి రాజు

కామర్స్ విద్యార్థులకు అవగాహన సదస్సు


విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న మనోజ్

చోడవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు కంపెనీ సెక్రెటరీస్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం ఛాంబర్ ఆఫ్ సెక్రెటరీ మనోజ్ కంపెనీ సెక్రెటరీస్ కోర్సులు, కామర్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్,కామర్స్ హెచ్‌వోడీ వి. అప్పలనాయుడు, అధ్యాపకులు బిచ్చమ్మ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కె.కోటపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కింతాడ పంచాయతీ గంగాభవానిపాలెనకు చెందిన కిలపర్తి సన్నిబాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్‌ను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం అందించారు. కిలపర్తి సన్నిబాబు గతంలో ప్రమాదానికి గురయ్యారు. ఎమ్మెల్యే బండారు చొరవతో ప్రభుత్వం రూ.1,16,786 లక్షలు ప్ర భుత్వం విడుదల చేసింది. ఈ చెక్‌ను ఎమ్మెల్యే బాధితునికి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, నాయకులు క న్నూరు సూర్యనారాయణ, కసిరెడ్డి అప్పలనాయుడు, జూరెడ్డి రాము, పూడి నారాయణమూర్తి, సర్పంచులు దాడి ఎరుకునాయుడు, బొడ్డు అక్కునాయుడు, జనసేన నాయకులు కడుపుట్ల గంగనాయుడు, సీముసురు దేవుళ్ళు పాల్గొన్నారు.

21న కోనాం జలాశయం కమిటీ చైర్మన్ ఎన్నిక

చీడికాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనాం జలాశయం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక ఈనెల 21న జరుగుతుందని నీటిపారుదలశాఖ ఏఈఈ సిహెచ్. జయరాంపడాల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 9 నుంచి ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే ఆరు మీడియం సంఘాలు, మూ డు మైనర్ సంఘాలకు ఎన్నికలు నిర్వహించామన్నారు. ఐదుమీడియం సంఘాల అధ్యక్ష ఎన్నికలు పూర్తికాగా, మూడు మైనర్ ఇరిగేషన్ సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక పూర్తిచేశామన్నారు. హెచ్ఎల్‌సీ 2వ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక వాయిదా వేశామన్నారు. కోనాం జలాశయం పరిధిలో జరిగిన అన్ని సంఘాల అధ్యక్షులతో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఆయా సాగునీటి సంఘాల అధ్యక్షులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

▸ చెట్లకు నష్టం జరగకుండా జనవరి నుంచి ఎండిన ఆకులకు ముందుగా నిప్పు

▸ అడవి జంతువుల సంరక్షణ, అడవుల పరిరక్షణపై సమీప గ్రామాల ప్రజలకు అవగాహన

▸ ఎలమంచిలి మండలం వేమగిరిలో నగర వనాల అభివృద్ధి : డీఎఫ్‌వో శామ్యూల్

గొలుగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు డీఎఫ్‌వో ఎం.శామ్యూల్ తెలిపారు. గొలుగొండ గల కలప డిపోలో గురువారం టేకు కలప వేలం నిర్వహించారు. ఈ ప్రక్రియను పరిశీలించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గల అటవీ ప్రాంతాల్లో జనవరి నుంచి ఎండిన ఆకులకు ముందుగా నిప్పంటించి, చెట్లకు ఎటువంటి నష్టం కలగకుండా చూస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో ప్రజలకు అడవి జంతువుల సంరక్షణ, అటవీ ప్రాంత పరిరక్షణ తదితరాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

వచ్చే ఏడాది ఐదు లక్షల మొక్కల పెంపకం లక్ష్యం

ఇదిలావుంటే వచ్చే ఏడాది సీజన్‌లో ఐదు లక్షల వివిధ రకాలైన మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని డీఎఫ్‌వో వివరించారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో ధన్వంతరీ వనంతో పాటు ఎలమంచిలి మండలంలోని వేమగిరి గ్రామంలో రెండు కోట్ల రూపాయల నిధులతో నగర వనాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనికి నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. అడవుల పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్, రేంజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో శామ్యూల్

సౌత్ జోన్ పవర్‌లిఫ్టింగ్‌లో ఇంటర్ విద్యార్థికి ద్వితీయ స్థానం


కుమారస్వామిని అభినందిస్తున్న హెచ్‌ఎం

గొలుగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇక్కడి గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఎంపీసీ విద్యార్థి చిటికెల కుమారస్వామి ద్వితీయ స్థానం సాధించాడు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఐదు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో కుమారస్వామి అద్భుత ప్రతిభ చూపాడని ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు తెలిపారు. గురువారం అతనిని అభినందించారు.

భావితరాల కోసం ఇంధన పొదుపు అవసరం

గొలుగొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : భావితరాల కోసం ఇంధన పొదుపు ఎంతో అవసరమని విద్యుత్ శాఖ నర్సీపట్నం డివిజనల్ డీఈ ఎస్.సునీల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం గొలుగొండలో గల అంబేద్కర్ గురుకుల కళాశాలలో గురువారం నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాల్లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. విద్యుత్ పరికరాలను వినియోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని తమ తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ కె.రాజేంద్రప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇంధన పొదుపుపై మాట్లాడుతున్న డీఈ సునీల్‌కుమార్

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

▸ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

▸ కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లోకనాథం


అబీద్ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న ప్రతినిధులు

నర్సీపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. అంబే డ్కర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా గురువారం నర్సీ పట్నం అబీద్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించడం తగదన్నారు. కేవీపీఎస్ ప్రతినిధులు ఈరెల్లి చిరంజీవి, సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు నుంచి పినగాడి వరకు నాలుగు లైన్ల రోడ్డుకు ప్రతిపాదనలు

▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, డిసెంబరు మ19 (ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాడేరు నుంచి పెదగాడి వరకు నాలుగు లైన్ల రోడ్డుకు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గ కేంద్రం మాడుగులను కలుపుతూ అర్జునగిరి, కలిగొట్ల, కె.కోటపాడు మీదుగా పినగాడి ప్రధాన కూడలి జాతీయ రహదారికి అను సంధానం చేస్తామన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ తదితరులతో కలసి కేం ద్ర రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి వివరించామన్నారు. భద్రాచలం నుంచి పార్వతీ పురం వరకు నాలుగు వరుసల రోడ్ల నిర్మాణంతో కలిగే ప్రయోజనాలను తెలిపామన్నారు. అలాగే, పాడేరు నుంచి మాడుగుల మీదుగా పినగాడి వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంతో విమానాశ్రయానికి, ఇటు విశాఖ పోర్టుకి దగ్గర మార్గం అవుతుందన్నారు. గిరిజనులు పండించే ఉత్పత్తులను నేరుగా విశాఖ తీసుకు వెళ్లడానికి ఉపయోగ పడుతుందన్నారు. వేలాది కుటుంబాల జీవనం మారుతుందన్నారు. ఒడిశా, కోల్‌కతా, చెన్నై తదితర దూర ప్రాంతాలకు తక్కువ సమయంలో ప్రయాణించవచ్చన్నారు. కేం ద్ర మంత్రి దీనిపై సానుకూలంగా స్పందించారన్నారు. సంబంధిత శాఖ అధికారులకు డిజైన్ ప్రాజెక్టు రిపోర్టు అందించాలని ఆదేశించామన్నారు. ఐటీడీఏలో విలీనంకాక మైదాన ప్రాంతాల గిరిజనులకు అన్యాయం జరుగుతుందని గిరిజన శాఖ మంత్రి జూయల్ ఓరంజ్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. దీనికి నివేదిక కావాలని గిరిజన శాఖా అధికారులను ఆయన ఆదేశించారన్నారు. కె.కోటపాడు మండలంలో ఉన్న 200 ఎకరాల ప్రభుత్వ భూమి పారిశ్రామిక ఎస్ఈజెడ్‌కు అనుకూలంగా ఉందన్నారు. దీనిపై కేంద్ర పారిశ్రామిక మంత్రి పీఎస్ గోయల్‌ని కోరగా నిధులు మంజూరుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ అధ్యక్షుడు సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డిరామానాయుడు, పాత్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

గొర్రెలు, మేకల నుంచి రక్త నమూనాల సేకరణ


బైలపూడిలో మేకను పరిశీలిస్తున్న డాక్టర్ హిమజ

చీడికాడ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు రక్తనమూనాలు సేకరించాలని విశాఖపట్నం పశువైద్యుల ప్రాంతీయ నిర్ధారణ ప్రయోగశాల పశువైద్యాధికారి హిమజ కోరారు. గురువారం మండలంలో బి.సింగవరం, జైతవరం, అర్జునగిరి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామా ల్లో మేకలు, గొర్రెల నుంచి రక్తనమూనాలు సేకరించిన అనంతరం ఆమె మా ట్లాడారు. పీపీఆర్ వ్యాక్సినేషన్స్ వేశారు. గొర్రెలు, మేకలకు ఉండే రక్తనమూనాలు సేకరించారు. ఆవులు, గేదెలు, దూడపెయ్యిలకు నాలుగు నెలల నుం చి ఎనిమిది నెలలు వయస్సు ఉన్న వాటికి టీకాలు తప్పనిసరిగా వేయించాల న్నారు. ఈ శీతాకాలంలో జీవాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల జా గ్రత్తలు పాటించాలన్నారు. పాకలకు పరిశు భ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పెదగోగాడ వైద్యాధికారి రాఘవమ్మ, సిబ్బంది మూ ర్తి, శ్రీనివాస్, శరగడం గంగునాయుడు, బి.సింగవరం సర్పంచ్ శరగడం సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'రైవాడ' చైర్మన్ అభ్యర్థిగా పాత్రునాయుడు పేరు ప్రతిపాదన


పాత్రునాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

దేవరాపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) రైవాడ జలాశయ చైర్మన్ అభ్యర్థిగా పోతల పాత్రునాయుడును ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి, నీటి సంఘం అధ్యక్షులు ప్రతిపాదించారు. దేవరాల్లి, కెకోటపాడు మండలాలకు చెందిన నీటి సంఘం అధ్యక్షులు మఖ్య నాయకులు గురువారం సమావేశమయ్యారు. చైర్మన్‌గా అభ్యర్థిగా పోతల పాత్రునాయుడు(అలమండ), మూడేళ్లు, వైస్ చైర్మన్‌గా ఏ కోడూరుకు చెందిన బొడ్డు ఉమాదేవీ రెండేళ్లు పాటు పదవి చేపట్టడానికి నిర్ణయించారు. అందరి అభిప్రాయాలు సేకరణ అ నంతరం ఈనెల 21న నామినేషన్ వేసి ఏకగ్రీవంగా గెలిపించాలని 11 నీటి సంఘాల అధ్యక్షులను ఆయన కోరారు. పాత్రునాయుడు, మాజీఎమ్మెలల్యే గవిరెడ్డిరామానాయుడు, మాజీఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల అగచాట్లు

మాడుగుల రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో కోసిన వరి చేనును కట్టలు కట్టి పొలాల నుంచి ఒడ్డుకి చేర్చుతున్నారు. తడిచిన వరి చేనుపై తప్పనిసరి పరిస్థితుల్లో కుప్పలు పెట్టి టార్పాలిన్లను రక్షణగా కప్పుతున్నారు. పొలాల్లో వర్షంనీరు చేరడంతో చేను సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. పంట దక్కించుకునే సమయాల్లో వర్షాలు పడటంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కూలీలు దొరక్క రైతుల కుటుంబ సభ్యులంతా పంటను కళ్లాలకు చేర్చే పనులు చేపడుతున్నారు. వరిచేనుని కుప్పలు పెడుతున్నారు.


వరిచేనుని కుప్పలు పెడుతున్న రైతులు

జనవరి 25 నుంచి నిండుగొండలో గౌరీ పరమేశ్వర తీర్థం

రోలుగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిండుగొండలో గౌరీ పరమేశ్వరుల తీర్థ మహోత్సవాలను జనవరి 25 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ సర్పంచ్ శెట్టి సంధ్య తెలిపారు. జనవరి 25న విగ్రహాలక వెలుపలకు తీసి పూజలు, 26న గౌరీపరమేశ్వరుల ఊరేగింపు, తీర్థం, 27న నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31న రాజుబాబు పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని సర్పంచ్ కోరారు.

ఆక్రమణలు తొలగింపు


టి.అర్జాపురంలో ఆక్రమణలు తొలగిస్తున్న కార్యదర్శి సత్యారావు

రావికమతం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురంలో డ్రైనేజీలపైన నిర్మించిన పక్కా కట్టడాలను పంచాయతీ కార్యదర్శి పాతాల సత్యారావు ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానం మేరకు రామాలయం నుంచి చిలకవానిపాలెం వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించనున్నారు. ఈ మేరకు ఎక్సకవేటర్ సాయంతో ఆక్రమణలు తొలగింపు చేపట్టారు.

సదరం క్యాంపునకు హాజరుకాని వైద్య నిపుణుడు

▸ రెండు వారాలుగా నిరాశతో వెనుదిరుగుతున్న దివ్యాంగులు

మాడుగుల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి గురువారం సదరం సర్టిఫికెట్లు మంజూరుచేసే ఆర్థోపెడిక్ వైద్యనిపుణుడు రెండు వారాలుగా రాకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వస్తున్న దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం ఆస్పత్రి వద్ద పలువురు దివ్యాంగులు తమ ఆవేదనను విలేకరుల ఎదుట వెల్లబుచ్చారు. చాలా దూరం నుంచి వచ్చి డాక్టర్ లేక వెళ్లిపోతున్నామని, గత వారం కూడా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. అయితే, గత మంగళవారం డాక్టర్ వచ్చి కొంతమంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసినట్టు ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. నిర్దేశించిన వారం కాకుండా రావడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ప్రతి గురువారం సుమారు 15మంది వరకూ దివ్యాంగులు ఈ ఆస్పత్రికి వచ్చి వైద్య నిపుణుడితో సదరం వైద్య పరీక్షలు చేయించుకుని సదరం సర్టిఫికెట్ పొందుతున్నారు. ఆ అవకాశం రెండు వారాలుగా లేకపోవడంతో సమస్య ఎదుర్కొంటున్నట్టు దివ్యాంగులు వాపోతున్నారు. అలాగేదంత వైద్యులతోపాటు ఫిజియోథెరపిస్ట్ అసిస్టెంట్ లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గురువారం సదరం డాక్టర్ వచ్చేలా చర్యలు చేపట్టాలని దివ్యాంగులు కోరుతున్నారు. ఈ విషయాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వద్ద ప్రస్తావించగా సదరన్ డాక్టర్ హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.


మాడుగుల ఆస్పత్రి

పరిశ్రమల్లో ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి

▸ జిల్లా పోలీస్ సిబ్బంది శిక్షణ శిబిరం ముగింపోత్సవంలో రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

పరవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాల పట్ల పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. ఇక్కడి ఫార్మాసిటీలోని మ్యాచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ (ఎంఏఎస్ఆర్ఎం) ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లా పోలీస్ సిబ్బందికి మూడు రోజులుగా 'రిస్క్ అసెస్‌మెంట్ ప్రివెన్షన్- మిటిగేషన్ ఇండస్ట్రీయల్ సేఫ్టీ'పై శిక్షణ తరగతులను నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపోత్సవంలో డీఐజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు వ్యూహాత్మకంగా ప్రమాదస్థలిలో చిక్కుకున్న కార్మికులను కాపాడాలన్నారు. అదే సమయంలో తమను తాము కూడా రక్షించుకోవాలన్నారు. తమ సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి సహకరించిన ఎంఏఎస్ఆర్ఎం ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ మల్లికార్జునరావు, పరిశ్రమల తనిఖీ అధికారులు జె.శివశంకర్‌రెడ్డి, జీవీవీఎస్ నారాయణ, కె.వీరభద్రరావు, ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు, ఎన్.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ పొందిన పోలీస్ సిబ్బందితో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్‌సిన్హా

పరవాడ స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ

ఇదిలావుంటే, వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాతో కలిసి గురువారం పరవాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. తొలుత వీరు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, పెండింగ్ కేసుల వివరాలను డీఎస్పీ కేవీ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాలకు గురికాకుండా వాటిపై అవగాహన కల్పించాలన్నారు. గంజాయి రవాణా నియంత్రణకు చెక్ పెట్టాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


పరవాడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐజీ, పక్కన ఎస్పీ

భాషా సేవకురాలు

సామాజిక అంశాలే ఇతివృత్తంగా రచనలు

పెదగంట్యాడ, ఆంధ్రజ్యోతి

సాహిత్య రంగానికి విశేష సేవలందించి, కథలు, కవితలు, పద్యాలు, వ్యాసాలు, గేయాలు, సీరియల్స్, గొలుసుకట్టు నవలలు, గ్రంథ సమీక్షలతో భాషకు, సాహిత్యానికి వన్నె తెస్తున్నారు ఆచార్య దేవులపల్లి పద్మజ. దేశభక్తి సాహిత్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా శాస్త్రవేత్తల మనోఫలకాలను ఆవిష్కరించేలా రచనలు సాగిస్తున్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో భాగమయ్యేలా ప్రసంగాలు చేశారు.

- సాహిత్యానికి వన్నె తెచ్చేలా కథలు, కవితలు
- సంస్కృత భాషకు ప్రచారం కల్పించేలా ఉచిత సంధ్యా పాఠశాల ఏర్పాటు
- జానపద సాహిత్యంపై విదేశీ వేదికపై ప్రసంగాలు
- ప్రశంసలందుకుంటున్న రచయిత్రి ఆచార్య దేవులపల్లి పద్మజ

తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన దేవులపల్లి పద్మజ తండ్రి చెరుకూరి సూర్యనారాయణ ఆటోమొబైల్ ఇంజనీరు, తల్లి కామేశ్వరి గృహిణి. కాకినాడలోనే ప్రాథమిక, ఉన్నత, కళాశాల విద్యను అభ్యసించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు కొనసాగించారు. చిన్నప్పటి నుంచి రచనాసక్తి ఉండడంతో ఎనిమిదో తరగతిలోనే మువ్వన్నెల జెండా శీర్షికన జాతీయ జెండాపై రాసిన కవిత ప్రశంసలందుకుంది. అప్పటి నుంచి రచనా ప్రస్థానం సాగిస్తున్న పద్మజ విశాఖకు చెందిన బీబీఆర్ఆర్ శర్మను వివాహం చేసుకున్న అనంతరం ఇక్కడే స్థిరపడ్డారు. ప్రస్తుతం గోపాలపట్నంలోని ఏయూ అనుబంధ కళాశాలలో ఆచార్యురాలుగా పనిచేస్తున్నారు. ఆమె భర్త బీబీఆర్ శర్మ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు.



ఆచార్య పద్మజను సత్కరిస్తున్న తెలుగు రచయితల సంఘం

భాషా సేవకు...

పద్మజ ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంకాం, ఎంఏ (తెలుగు), ఎంఏ (సంస్కృతం), సంస్కృతంలో పీహెచ్‌డీ చేశారు. సంస్కృత భాషకు విస్తృత ప్రచారం కల్పించేందుకు కృషి చేశారు. ఇందులో భాగంగా ఉచిత సంధ్యా పాఠశాల ఏర్పాటు చేశారు. తెలుగు- మాతృభాషా పరిరక్షణ సమితి ద్వారా మాతృభాషకు విస్తృత ప్రచారం కల్పించారు. ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ఆన్‌లైన్ ద్వారా భగవద్గీత తరగతులు నిర్వహించారు. దేశవ్యాప్తంగా సుమారు 1500 మందికి భగవద్గీత నేర్పించారు. శతావధానాలు, సహస్రావధానాల్లో పృచ్ఛకురాలిగా వ్యవహరించారు.



రచయిత్రి ఆచార్య దేవులపల్లి పద్మజ



పద్మజ రాసిన పుస్తకాల్లో కొన్ని...

స్వీయరచనలు

మల్లెలు కవితాసంపుటి, శ్రీకృష్ణమనోహరం శతకం, శ్రీరామాయణంలో మహర్షులు, ప్రకృతి పలుకుల్లో లోక రీతులు శతకం, సౌగంధి కవితా సంపుటి, ఉపనిషత్సార సంగ్రహం, వ్యాస సాహితి, భాష, భాషావేత్తల వ్యాసాలు, శ్రీమానస కథల సంపుటి, శ్రీహరినామావళి, నాటి కలలే - నేటి కన్నీళ్ళా చరిత్ర, కేజీ టు పీజీ సంస్కృత వ్యాకరణసూత్ర సంకలనం, సుభాషిత భాస్కరం శతకం,మంజూష లఘు నవల,వ్యాససాహితి -2 గణేశ గీతాలు పద్మజ రచనల్లో ప్రధానమైనవి.

బిరుదులు, సత్కారాలు

హైదరాబాద్ విశ్వసాహితి, అఖిల భాషా సాహితీ సమాఖ్య భోపాల్, మంచిర్యాల రచయితల సంఘం, ఉపాధ్యాయుల సంఘం,అఖిల భారత బ్రాహ్మణ సంఘం నుంచి పలు బిరుదులందుకున్నారు. బెంగళూరు సాహిత్య అకాడమీ, వాసవికన్యకాపరమేశ్వరి ట్రస్ట్ హైదరాబాద్, విశ్వసాహితీ, విజయనగరం గీతా చారిటబుల్ ట్రస్ట్ నుంచి గురజాడ తదితర పురస్కారాలు అందుకున్నారు.

ఆకాశవాణిలో ప్రసంగాలు

దేవులపల్లి పద్మజ ఆకాశవాణి విశాఖపట్నం, హైదరాబాద్ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు తెలుగు, సంస్కృత భాషల్లో 58కి పైగా ప్రసంగాలు చేశారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృత భాషల్లో 400కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించారు.

విదేశీ వేదికపై

విదేశీ వేదికపై ప్రసంగం చేశారు. ఖతార్‌లోని దోహా పట్టణంలో వంగూరి ఫౌండేషన్, ఆంధ్ర కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో జానపద గేయ సాహిత్యంపై ప్రసంగించారు. ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

ఆర్వో ప్లాంట్ తనిఖీ

- రెట్టింపు ధరకు నీళ్లు విక్రయిస్తున్నట్టు గుర్తించిన పంచాయతీ కార్యదర్శి
- ఇకపై 20 లీటర్ల నీళ్లు రూ.5కే విక్రయిస్తామని వెల్లడి
- తనిఖీలకు ముందే ఖాళీ వాటర్ బాటిళ్లను తరలించేసిన నిర్వాహకుడు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అచ్యుతాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ వద్ద గల ఆర్వో ప్లాంట్‌ను పంచాయతీ కార్యదర్శి శైలజారాణి గురువారం తనిఖీ చేశారు. ఇక్కడ 20 లీటర్ల వాటర్ క్యాన్ రూ.10లకు విక్రయించడమే కాకుండా లీటరు, అరలీటరు బాటిళ్లను విక్రయిస్తున్నట్టు గుర్తించారు. 'పంచాయతీ ఆదాయం పక్కదారి' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఈ తనిఖీలు చేపట్టారు. ఇక నుంచి ఇతరులకు 20 లీటర్ల నీటిని కేవలం ఐదు రూపాయలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా ఇస్తామని ఆమె తెలిపారు. కాగా కార్యదర్శి వెంట సర్పంచ్ విమలకుమారి రావలసి ఉండగా, ఆమెకు బదులుగా సర్పంచ్ భర్త వెంకునాయుడు రావడం చర్చనీయాంశమైంది. ఏ కార్యక్రమమైనా సర్పంచ్‌కు బదులు ఆయనే వెళుతుంటారని పలువురు చర్చించుకున్నారు.



ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కార్యదర్శి శైలజారాణి

పంచాయతీ వాహనంలో ఖాళీ బాటిళ్ల తరలింపు

ఆర్వో ప్లాంట్ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ప్లాంట్‌లో నిల్వ చేసిన లీటర్, అరలీటర్ ఖాళీ సీసాలను అక్కడ నుంచి తరలించడానికి ప్లాంట్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న శ్రీనివాసరావుకు పంచాయతీ పాలకవర్గం, అధికారులు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ పరిధిలో చెత్తను తరలించే వ్యాన్‌లో ఈ ఖాళీ సీసాలను మార్టూరు రోడ్డులోని ఇందిరమ్మకాలనీలో గల శ్రీనివాసరావు ఇంటికి తరలించినట్టు స్థానికులు చెబుతున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా కీలకం

- ఎన్నికల జాబితా పరిశీలకుడు ప్రవీణ్‌కుమార్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా కీలకమని, ఓటరు జాబితాల తయారీలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఈఆర్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సంక్షిప్త సవరణ -2025 ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఓటరు జాబితా సవరణ సక్రమంగా నిర్వహిస్తే ఎన్నికల నాటికి శుద్ధమైన ఓటరు జాబితా తయారవుతుందన్నారు. ఎన్నికల సంవత్సరంలో తొలగింపులు చేయడానికి ఎన్నికల కమిషన్ నుంచి ఆంక్షలు ఉంటాయని, ప్రస్తుతం ఎటువంటి ఆంక్షలు ఉండవని, ప్రతి అభ్యర్థనను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, ప్రజల నుంచి వచ్చే వినతులకు నిర్ణీత సమయంలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణ వివరాలను కలెక్టర్ విజయకృష్ణన్ వివరించారు. 2024 అక్టోబరు 29న ప్రచురించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రకారం జిల్లాలో 6,27,566 మంది పురుషులు, 6,62,276 మంది స్త్రీలు.. మొత్తం 12,89,870 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నూరుశాతం ఫొటో గుర్తింపు ఉందని, 99.99 శాతం మంది ఓటర్లకు ఓటరు కార్డు ఉందని చెప్పారు. ఈ నెల 24వ తేదీ నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరిస్తామని, జనవరి ఒకటో తేదీకి ఓటరు జాబితా సిద్ధం చేసి, ఆరో తేదీన తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్‌వో సత్యనారాయణరావు, ఆర్డీవోలు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకుడు ప్రవీణ్‌కుమార్

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జుల...

... 5వ పేజీ తరువాయి

ఆ కమిటీలను రద్దు చేసి సహకార శాఖ ఉద్యోగులను పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించింది. వారి నియామకపు గడువు శుక్రవారంతో ముగియనున్నది. దీంతో శనివారం నుంచి మరో ఆరు నెలలపాటు పర్సన్ ఇన్‌చార్జులను పొడిగించింది. ఈలోగా సంఘాలకు ఎన్నికలు జరిగితే గడువు ముగుస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

లారీని ఢీకొన్న ఆటో.. మహిళ మృతి

మాకవరపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం సమీపంలో ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని భీమబోయినపాలెం గ్రామానికి చెందిన రెడ్డి సత్యవతి(38) కోటవురట్ల మండలం తాళ్లపాలెం సమీపంలోని ఒక బీరు ఫ్యాక్టరీలో పని చేస్తున్నది. రోజూ ఇంటి నుంచి వెళ్లొస్తున్నది. గురువారం సాయంత్రం విధులు ముగిసిన తరువాత ఆటోలో ఇంటికి బయలుదేరింది. శెట్టిపాలెం సమీపంలో ఆగి ఉన్న లారీని, ఆటో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సత్యవతి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్‌ఐ దామోదరనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రావికమతం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. రావికమతం ఎస్‌ఐ రఘువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొమిర గ్రామానికి చెందిన బూరిగ అప్పారావు(43) బుధవారం సాయంత్రం కాయగూరలు కొనుగోలు చేసేందుకు రావికమతం వెళ్లాడు. రాత్రి పది గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనం పై తిరిగి ఇంటికి వెళుతుండగా గుమ్మళ్లపాడు వాటర్ ట్యాంక్ వద్ద రోడ్డుపై వున్న గొయ్యిని తప్పించే క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని అప్పారావును రావికమతం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో ప్రాణాలు వదిలాడు. అప్పారావు భార్య లక్ష్మీరేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

మాకవరపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తెలిపిన సమాచారం మేరకు.. మాకవరపాలెం గ్రామానికి చెందిన చందనాడ రమణ(43) బుధవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య నిలదీయడంతో ఆమెతో గొడవపడి చెయ్యి చేసుకున్నాడు. చనిపోతానని బెదిరించాడు. అంతేకాక ఇంట్లో వున్న పురుగుల మందు తాగి పడి పోయాడు. దీంతో అపస్మారక స్థితికి చేరిన రమణను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ దామోదరనాయుడు తెలిపారు.

నెలాఖరులో 'అరకు ఉత్సవ్'

పాడేరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అరకు ఉత్సవ్'ను ఈ నెలాఖరులో నిర్వహించనున్నామని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. 'ఉత్సవ్' ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అరకు పట్టణం మరింత సుందరంగా కనిపించేలా విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఉత్సవ్ ప్రాంగణంలో వివిధ రకాల స్టాళ్లను పెట్టాలని, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. మారథాన్, చిత్రలేఖనం, రంగోలి, కార్నివాల్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గులాబీల ప్రదర్శన, హాట్ ఎయిర్ బెలూన్, కాఫీ రుచుల పోటీలు, గిరిజన కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలు ఏర్పాటుచేయాలన్నారు.

అన్నదాత ఆందోళన

... 5వ పేజీ తరువాయి

వాతావరణ శాఖ సమాచారంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. అధిక వర్షాలు కురిస్తే ప్రజలకు తక్షణ సహాయ చర్యలు చేపట్టడానికి మండల అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండాలని, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాలతోపాటు కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో వుంచారు. ఇక్కడ టోల్ నంబర్లు (08924- 226599, 222888) ఏర్పాటు చేశారు.

450 కిలోల గంజాయి స్వాధీనం

... 5వ పేజీ తరువాయి

నిర్ధారించారు. నిందితులు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన రాజేశ్‌శర్మ, కిల్లో మహదేవ్‌లుగా గుర్తించి అరెస్టు చేశారు. గంజాయిని ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతం నుంచి విశాఖపట్నం తరలిస్తున్నట్టు నిందితులు చెప్పారని డీఎస్పీ వెల్లడించారు. మీడియా సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, గొలుగొండ, కృష్ణాదేవిపేట ఎస్‌ఐలు రామారావు, తారకేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గోతుల పూడ్చివేతపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

గోతుల పూడ్చివేత పనులు చేపట్టలేదు. ఇక చోడవరం నుంచి వడ్డాది వైపు వెళ్లే రోడ్డులో లక్ష్మీపురం కల్లాలు, విజయరామరాజుపేట, వడ్డాది వద్ద గుంతలు అప్పుడు ఎలా వున్నాయో.. ఇప్పుడూ అలాగే ఉన్నాయి. చోడవరం- చీడికాడ రోడ్డులో గుంతలను అరకొరగా పూడ్చారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గోతుల్లో నీరు చేరి పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కాగా బీఎస్ రోడ్డులో గోతులు కప్పకపోవడంపై ఆర్‌బీ జేఈ సత్యప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. గుంతలు పూడ్చేందుకు చర్యలు చేపట్టామని, తారు కొరత వల్ల పనులు మందగించాయని చెప్పారు.

క్రైం... crime news

బొడ్డేరు గెడ్డలో ధాన్యం లారీ బోల్తా

కృష్ణాదేవిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలో ఉన్న బొడ్డేరు గెడ్డలో ధాన్యం లారీ బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి వివ రాలిలా వున్నాయి.



బొడ్డేరు గెడ్డలో బోల్తాపడిన లారీ

అల్లూరి జిల్లా రాజవొమ్మంగి నుంచి ధాన్యం లారీ బుధవారం రాత్రి కాకినాడ జిల్లా కోటనందూరు సమీపంలోని చిన్నయ్యపాలెం రైస్‌మిల్లుకు బయలుదేరింది. కొయ్యూరు మండలం కాకరపాడు, గొలుగొండ మండలం ఏఎల్‌పురం మీదుగా నర్సీపట్నం వైపు వెళ్లాలి. అయితే హైవే నిర్మాణంలో భాగంగా పాతకృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం గ్రామాల వద్ద బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. కానీ ఈ విషయాన్ని గమనించని లారీ డ్రైవర్ చింతపల్లి వైపు వెళ్లే బైపాస్ రోడ్డులోకి వెళ్లిపోయాడు. బొడ్డేరు గెడ్డపై వంతెన నిర్మిస్తుండడంతో వాహనాలు వెళ్లడానికి పక్కన తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. గెడ్డ వద్ద ఎగువకు వెళ్లే క్రమంలో లారీ టైర్లు జారిపోయి వెనక్కు వచ్చి గెడ్డలోకి బోల్తాపడింది. లారీ వెనక్కు వచ్చే క్రమంలో డ్రైవర్ మహేశ్, క్లీనర్ అప్రమత్తమై కిందకు దూకేశారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

ఎస్.రాయవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామంలో మతిస్థిమితం లేని యువతి (20)పై కె.నాగరాజు (43) అత్యాచారానికి పాల్పడినట్టు గురువారం ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం..మతి స్థిమితం లేని యువతి ఒంటరిగా నడిచి వెళుతుండడం గమనించి అదే గ్రామానికి చెందిన నాగరాజు తన ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడైన నాగరాజును అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604